



ఓటు వేటలో.. వరాల మూట

- రాబోయే లోక్‌సభ ఎన్నికలే లక్ష్యంగా కేంద్ర బడ్జెట్
- ఐటీ పరిమితి రూ.7 లక్షలకు పెంపు... భిన్నవర్గాల్లో ఊరట
- ఉచిత విద్యుత్ పథకంతో మారుమూల గ్రామాలకు కాంతులు
- దిగుమతి సుంకం తగ్గింపుతో మొబైల్ దునియా హవా
- నిధుల కేటాయింపుతో 'ఉపాధి' కూలీలకు భరోసా
- ఉమ్మడి జిల్లాలో జాతీయ రహదారులకు మహర్దశ
- పూచీకత్తు లేకుండానే రూ.2.20లక్షల వరకు రుణాలు

ఖమ్మం, ఫిబ్రవరి1 (ఆంధ్రజ్యోతిప్రతినిధి): కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ గురువారం ప్రవేశపెట్టిన తాత్కాలిక బడ్జెట్ భిన్నవర్గాలకు ఊరట కలిగించేదిగా ఉంది. రాబోయే లోక్‌సభ ఎన్నికలను దృష్టిలో పెట్టుకొని వ్యక్తిగత ప్రయోజనాలకు ప్రాధాన్యతనిస్తూ అనేక వరాలు ప్రకటించారు. ఐటీ పరిమితిని పెంచడం బడ్జెట్‌లో ఈ సారి కీలకమైన అంశంగా చెప్పుకోవచ్చు. ప్రస్తుతం ఉన్న రూ.5లక్షల ఐటీ పరిమితిని రూ.7లక్షలకు పెంచారు. దీని వల్ల ఉమ్మడి ఖమ్మం జిల్లాలో సామాన్య, మధ్యతరగతి వర్గాలకు కొంత ఊరట కలగబోతోంది. ఇప్పటివరకు రూ.5లక్షల ఆదాయం దాటితే ఐటీభారం పడుతుండగా, దీనిని రూ.7లక్షలకు పెంచడంతో ఉద్యోగ, వ్యాపారవర్గాలకు ఉపశమనం కలగనుంది. ఉమ్మడిజిల్లాలో లక్షన్నర మందివరకు ఆదాయపన్ను చెల్లింపుదారులు ఉన్నారు. ఇందులో రూ.5లక్షలవరకు ఆదాయం ఉన్నవారు సుమారు 50వేల మందికిపైగా ఉన్నారు.

మరోవైపు దేశవ్యాప్తంగా ఉచిత విద్యుత్ కింద కోటి ఇళ్లకు 300 యూనిట్ల చొప్పున అందించేందుకు సోలార్ యూనిట్ల ఏర్పాటుకు కేంద్రం నిర్ణయం తీసుకుంది. దీని ఫలితంగా ఉమ్మడి జిల్లాలో కొండరెడ్లు, గొత్తికోయల గ్రామాలతోపాటు మారుమూల గిరిజన గ్రామాలకు ప్రయోజనం చేకూరనుంది. ఇప్పటివరకు రాష్ట్ర ప్రభుత్వాలు కొంత సబ్సిడీని భరించి సోలార్ దీపాలు పెడుతున్నప్పటికీ అవి పూర్తిస్థాయిలో ప్రయోజనం చేకూర్చడంలేదు. ఖమ్మం, భద్రాద్రి జిల్లాల్లోని అటవీప్రాంతాల్లో 50కి పైగా కోయ, గొత్తికోయ గిరిజన గ్రామాలున్నాయి ఈ గ్రామాలకు కొన్ని చోట్ల విద్యుత్ సరఫరా ఉన్నప్పటికీ పలురకాల అవాంతరాలతో సరఫరా జరగడంలేదు. కేంద్ర ప్రభుత్వం బడ్జెట్‌లో 300యూనిట్లు వరకు ఉచిత విద్యుత్ పథకం అమలుచేస్తూ సోలార్ యూనిట్లు ప్రతిపాదించింది. ఇది గిరిజన గ్రామాలకు కొంత మేలు చేకూర్చనుంది.

ఇక మొబైల్ ఫోన్లపై దిగుమతి సుంకాన్ని 15శాతం నుంచి 10శాతానికి తగ్గించడంతో వాటి ధరలు కొంత తగ్గే అవకాశం ఉంది. మొబైల్‌ఫోన్ల కొనుగోలుదారులకు కొంత ఊరట కలిగించనుంది. అలాగే రూ.2.20లక్షల వరకు బ్యాంకుల్లో ఎలాంటి పూచీకత్తు లేకుండా రుణాలు ఇచ్చే అంశాన్ని బడ్జెట్‌లో ప్రతిపాదించారు. అయితే ఇప్పటికే కొంతమేర ఈ విధానం ఉన్నప్పటికీ హామీలు లేకుండా బ్యాంకులు రుణాలు ఇచ్చేందుకు ముందడుగు వేయడం లేదు.

ముద్ర రుణాలు కూడా ఎప్పటిలాగానే కేంద్రం ప్రకటించింది. ఈ రుణాల విషయంలో బ్యాంకులు ప్రభుత్వ లక్ష్యానికి అనుగుణంగా ఇవ్వడంలేదన్న విమర్శ ఉంది. షాపులున్న వారికి రాజకీయపార్టీలు నాయకులు సిఫార్సులు చేసిన వారికి మాత్రమే ముద్ర రుణాలు అందుతున్నాయన్న ఆరోపణలున్నాయి.

5నుంచి 18 ఏళ్లలోపు బాలికలకు సర్వేకల్ క్యాన్సర్ నివారణకు వైద్యసహకారం అందిస్తామని కేంద్రం పేర్కొనడం ద్వారా మహిళలకు గర్భస్థ క్యాన్సర్ నివారణకు అవకాశం కలగనుంది.

ఇక గ్రామీణ ఉపాధి హామీ కింద ఈసారి బడ్జెట్‌లో కూడా రూ.86వేల కోట్లు ప్రకటించారు. ఉమ్మడి జిల్లాలో 'ఉపాధి హామీ' కింద ప్రతిఏటా సుమారు రూ.500కోట్ల వరకు ప్రతిపాదనలుచేసి పనులు జరిపిస్తున్నారు. నిధులు కేటాయించడం ద్వారా గ్రామీణ ఉపాధికూలీలకు ఉపాధి లభించనుంది.

అలాగే కేంద్ర ప్రభుత్వం ఆయుష్మాన్‌భవ పథకానికి రూ.7500 కోట్లు కేటాయిచింది. ఈ నిధుల సహకారంతో రూ.5లక్షల వరకు ఉచిత వైద్యం అందే పథకం తిరిగి అమలుకానుంది.

అలాగే జాతీయ రహదారులకు కేంద్రం పెద్దపీటవేస్తూ నిధులు కేటాయిచింది. రూ.2.55లక్షల కోట్లు కేటాయించడం జాతీయ రహదారుల పనులు జరగనున్నాయి. ఉమ్మడిజిల్లాలో ఖమ్మం-దేవరపల్లి, నాగపూర్-అమరావతి,కోదాడ-ఖమ్మం, కొత్తగూడెం-హైదరాబాద్ తదితర జాతీయ రహదారుల పనులు సాగుతున్నాయి. కొన్ని ప్రతిపాదనలో ఉన్నాయి. ఈపనులు ఇబ్బందులు లేకుండా జరిగే అవకాశం ఉంది. ఎన్నికల తర్వాత వచ్చే ప్రభుత్వం చేపట్టే పూర్తిస్థాయిబడ్జెట్‌లో కేటాయింపులతోనే ఆయాశాఖల అభివృద్ధి పనులు, సంక్షేమపథకాలు అమలుకానున్నాయి.

తెలంగాణకు మళ్లీ మొండిచేయి

నామా నాగేశ్వరరావు, లోక్‌సభలో బీఆర్ఎస్ పక్ష నేత



కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మల సీతారామన్ ప్రవేశ పెట్టిన బడ్జెట్ పూర్తి నిరాశ నిస్పృహతో కూడుకుని ఉంది. బడ్జెట్ ప్రసంగం రాజకీయ ప్రసంగాన్ని తలపించింది కానీ, ఏ వర్గాన్ని సంతృప్తి పరచలేదు. ఒక్క కొత్త సంక్షేమ పథకం గురించి కూడా బడ్జెట్‌లో ప్రస్తావన చేయలేదు. దేశంలో ద్రవ్యోల్బణం, నిరుద్యోగం పతాకస్థాయికి చేరుకున్నాయి. నియంత్రణ చేసే దిశగా బడ్జెట్‌లో ఎలాంటి ప్రస్తావన లేదు. ద్రవ్యోల్బణం పెరుగుదలకు అనుగుణంగా సవరణ చేస్తారని 5 ఏళ్ల నుంచి ఉద్యోగులు నిరీక్షిస్తున్నారు. కానీ ఈసారి కూడా వారికి తీవ్ర నిరాశే ఎదురైంది. పీఎం కిసాన్ సాయం పెంచుతారని రైతులు ఆశించినప్పటికీ భంగపాటు తప్పలేదు. డీజిల్, పెట్రోల్, గ్యాస్ ధరలు ఆకాశాన్ని అంటుతున్నాయి. సామాన్యుడిపై భారం తగ్గించే ప్రయత్నం చేయలేదు. అయుష్మాన్ భారత్ పథకం కింద అందించే కవరేజ్ రూ.10లక్షలకు పెంచుతారని పేదలు ఎదురుచూశారు.. కానీ పెంచలేదు. ఎప్పటిలాగే తెలంగాణకు మరోసారి మొండిచేయి చూపారు. విభజన హామీల అమలు, హక్కుగా రావాల్సిన నిధుల గురించి ప్రస్తావన లేదు. -ఆంధ్రజ్యోతి ప్రతినిధి, ఖమ్మం

పేద, మధ్యతరగతికి భరోసా

గల్లా సత్యనారాయణ, బీజేపీ జిల్లా అధ్యక్షుడు



వికసిత్ భారత్ పేరుతో ప్రవేశపెట్టిన బడ్జెట్ పేద, మధ్యతరగతి కుటుంబాలకు, మహిళలు, యువత, వ్యాపార వర్గాలన్నింటికీ తోడ్పాటు అందించే విధంగా ఉంది. ప్రధాన మంత్రి గరీబ్ కల్యాణయోజన పథకం కింద 80కోట్ల మంది పేదలకు ఉచితంగా బియ్యం పంపిణీచేయడం జరుగుతోంది. ఆశావర్కర్లు, అంగన్‌వాడీ కార్యకర్తలు, వారిసహాయకులు అయుష్మాన్‌యోజన పథకం వర్తింపచేయడం శుభపరిణామం. అదేవిధంగా రవాణశాఖకు రూ.6.2లక్షల కోట్లు కేటాయించడం, జాతీయ రహదారుల నిర్మాణానికి రూ.2.78లక్షల కోట్లు కేటాయించడం ఎంతో ఉపయోగకరం. 30కోట్లమందిపైగా మహిళలకు ముద్ర యోజన ద్వారా రుణసదుపాయం కల్పించడం సంతోషకరం. -ఖమ్మం బైపాస్‌రోడ్

కార్పొరేట్ శక్తులకు అనుకూల బడ్జెట్..

పోటు ప్రసాద్, జిల్లా కార్యదర్శి, సీపీఐ



కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన మధ్యంతర బడ్జెట్ కార్పొరేట్ శక్తులకు అనుకూలంగా ప్రజా వ్యతిరేకంగా రూపొందించారు. కార్పొరేట్ పన్నులను 30శాతం నుంచి 22శాతానికి కుదించారు. సామాన్య ప్రజలకు బడ్జెట్ వల్ల ఎటువంటి ప్రయోజనం లేదు. నిత్యావసర ధరలు పెరిగేలా బడ్జెట్ ఉంది.

మోదీకి వీడ్కోలు బడ్జెట్..

ఆవుల అశోక్, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు, ప్రజాపంథా



కేంద్ర ప్రభుత్వ మధ్యంతర బడ్జెట్ అంకెల గారడీలా ఉంది. రానున్న ఎన్నికల్లో మోదీ ప్రభుత్వానికి సామాన్య ప్రజలు వీడ్కోలు పలికేలా ఏర్పాటుచేశారు. వ్యవసాయం,విద్య,వైద్యం,సేవా,రవాణా,కార్మిక రంగాలను విస్మరించారు. ఆదాయానికి వ్యయానికి మధ్య వ్యత్యాసం ఉంది.

వాస్తవ లెక్కలకు పొంతనలేదు..

పోతినేని సుదర్శన్‌రావు, సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు



వ్యవసాయ రంగానికి బడ్జెట్ కేటాయించామని ప్రకటించారు. కానీ వాస్తవ లెక్కలకు సంబంధం లేదు. వ్యవసాయానికి కేంద్ర బడ్జెట్‌లో ప్రకటించింది రూ.2,22,281 కోట్లు కాగా, వాస్తవంగా కేటాయించింది రూ.1.17,528కోట్లే. ఆహార పదార్థాలు, ఉపాధి హామీకి సరైన నిధులు కేటాయించలేదు. కార్పొరేట్ శక్తులకు అనుకూలంగా ఉంది.

కార్పొరేట్ శక్తులకు వ్యవసాయరంగం తాకట్టు..

ఎమ్డీ జావీద్, టీపీసీసీ సభ్యుడు



వ్యవసాయరంగంలో ఎగుమతులు, దిగుమతుల వ్యాపారాన్ని కార్పొరేట్ శక్తులకు కేంద్ర బడ్జెట్‌లో తాకట్టు పెట్టారు. ఆర్‌బీఐ సూచించిన విధంగా పంట రుణాలు 18శాతం, దీర్ఘకాలిక రుణాలు 22శాతం ఇవ్వటానికి బ్యాంకర్లు ముందుకు రావటం లేదు. గతంలో ఉపసంహరించిన మూడు రైతు చట్టాలను మరో రూపంలో అమలు చేస్తోంది.

ఇదేం పని సారూ?

విద్యార్థినుల పట్ల అనుచిత ప్రవర్తన



ఇల్లెందు టౌన్, ఫిబ్రవరి 1: విద్యార్థులకు విద్యాబుద్ధులు నేర్పి.. మంచి నడవడిక నేర్పాల్సిన ఓ ఉపాధ్యాయుడు ఆ వృత్తికే కళంకం తెచ్చాడు. విద్యార్థినుల్లో తన పిల్లలను చూసుకోవాల్సింది పోయి అసభ్యంగా ప్రవర్తించాడు. ఈ సంఘటన భద్రాద్రి జిల్లా ఇల్లెందు పట్టణంలోని సింగరేణి పాఠశాలలో వెలుగులోకి వచ్చింది. బాధిత విద్యార్థినుల తల్లి దండ్రులు తెలిపిన వివరాల ప్రకారం.. ఇల్లెందు పట్టణంలోని సింగరేణి పాఠశాలలో ఓ ఉపాధ్యాయుడు విధులు నిర్వహిస్తున్నాడు. ఆ పాఠశాలలో తొమ్మిదో తరగతి చదివే నలుగురు విద్యార్థినుల పట్ల ఇటీవల తరుచూ అసభ్యంగా, అనుచితంగా ప్రవర్తిస్తున్నాడు. ఈ విషయాన్ని గత నెల 24న పాఠశాల హెచ్‌ఎం వెంకటేశ్వర్లుకు విద్యార్థినులు, వారి తల్లిదండ్రులకు ఫిర్యాదు చేశారు. ఈ ఫిర్యాదు మేరకు విచారణ చేపట్టిన సింగరేణి అధికారులు ఉపాధ్యాయుడు విద్యార్థినుల పట్ల వ్యవహరించిన తీరు సరిగ్గా లేదంటూ విచారణలో వెల్లడైంది. ఈ సంఘటనపై స్థానిక అధికారులు తదుపరి చర్యల కోసం సింగరేణి ఉన్నత అధికారులకు లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేశారు.

బడికి రావడం లేదని బడితె పూజ



ముదిగొండ, ఫిబ్రవరి 1: బడికి రావడం లేదని ఓ విద్యార్థిపై ఉపాధ్యాయుడు బడితె పూజ చేశాడు. ఉపాధ్యాయుడు కొట్టిన దెబ్బలకు ఆ విద్యార్థి పిరుదల భాగంలో వాతలు తేలాయి. ఖమ్మం జిల్లా ముదిగొండ మండలం బాణాపురం ప్రాథమిక పాఠశాలలో నాలుగో తరగతి విద్యార్థిని పాఠశాలలకు సక్రమంగా రావడం లేదని మహబూబ్‌పాషా అనే ఉపాధ్యాయుడు బుధవారం సాయంత్రం చితకబాదాడు. దీంతో విద్యార్థి పిరుదుల భాగంలో వాతల తేలాయి. గమనించిన తల్లిదండ్రులు పాఠశాలకు వెళ్లి ఉపాధ్యాయుడిని నిలదీశారు.

పాఠశాలకు సరిగా రావడం లేదని కొట్టానని చెప్పడంతో తల్లిదండ్రులు ఆగ్రహం వ్యక్తం చేసి ఆందోళన చేశారు. ప్రధానోపాధ్యాయుడు కలుగజేసుకొని ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లి సదరు టీచర్‌పై చర్యలు తీసుకుంటామని హామీ ఇవ్వడంతో వారు ఆందోళన విరమించారు.

'తెలుగు' తమ్ముళ్లు నిద్రపోలేదు..

- పార్టీకి లాభం లేకపోయినా కాంగ్రెస్‌కు మద్దతిచ్చారు
- బీఆర్ఎస్‌ను ఓడించడంలో కీలకపాత్ర పోషించారు
- రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి
- టీడీపీ, సీపీఐ, ప్రజాపంథా కార్యాలయాలకు వెళ్లి కృతజ్ఞతలు



టీడీపీ కార్యాలయంలో మాట్లాడుతున్న రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి

ఖమ్మంమామిళ్లగూడెం/ఖమ్మం సంక్షేమ విభాగం, ఫిబ్రవరి 1: రాజకీయంగా టీడీపీకి ఎలాంటి లాభం లేకపోయినా... రాష్ట్రంలో మార్పురావాలని బీఆర్ఎస్‌ను ఓడించే వరకు తెలుగు తమ్ముళ్ల నిద్రపోకుండా పనిచేశారని రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. ఇంద్రవెల్లి సభలో మరో రెండు గ్యారంటీలు అమలు చేస్తామన్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి మద్దతు తెలిపినందుకు మంత్రి పొంగులేటి గురువారం ఖమ్మంలోని టీడీపీ, సీపీఐ, సీపీఐఎంఎల్ ప్రజాపంథా కార్యాలయాలకు వెళ్లి కృతజ్ఞతలు తెలిపారు.

ముందుగా టీడీపీ కార్యాలయంలో ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలువేసి నాయకులు, కార్యకర్తలతో మాట్లాడారు. రాష్ట్రంలో మార్పుకోసం 119 నియోజకవర్గాల్లో కాంగ్రెస్‌కు మద్దతు ఇచ్చి తెలంగాణప్రజలు కోరికను నెరవేర్చారన్నారు. ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని పది నియోజకవర్గాల్లో ఎక్కడైనా కాంగ్రెస్ నాయకులు ఆదమరిచి నిద్రపోయారేమోకానీ తెలుగు తమ్ముళ్ల మాత్రం నిద్రపోలేదని కితాబు ఇచ్చారు. రాష్ట్రంలో అహంకారపూరిత పాలనకు ప్రజలు చరమగీతం పాడారని తెలిపారు. తెలంగాణలో మార్పుకోసం సహకరించిన టీడీపీ అధినేత చంద్రబాబునాయుడుకు ఆయన కుమారుడు లోకేష్‌కు తెలంగాణ రాష్ట్ర టీడీపీ నాయకులు, కార్యకర్తలకు కృతజ్ఞతలు తెలిపారు. టీడీపీ సహకారాన్ని కాంగ్రెస్ ఎప్పటికీ మరిచిపోదన్నారు. భవిష్యత్ రాజకీయాల్లోనూ టీడీపీ, కాంగ్రెస్ కలిసి ప్రయాణం సాగించాలని ఆకాంక్షించారు.

టీడీపీ పార్లమెంట్ కమిటీ అధ్యక్షుడు వాసిరెడ్డి రామనాథం మాట్లాడుతూ పొంగులేటి శ్రీనివాసరెడ్డి టీడీపీ కార్యాలయానికి రావడం సంతోషకరమన్నారు. ఎన్టీఆర్ జయంతి వర్ధంతిలను ప్రభుత్వపరంగా నిర్వహించాలని కోరారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు బాలసాని లక్ష్మీనారాయణ, టీడీపీ ఖమ్మం నియోజకవర్గ ఇన్‌చార్జ్ కూరపాటి వెంకటేశ్వర్లు, టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కేతినేని హరీష్, ఉపాధ్యక్షుడు కొండబాల కరుణాకర్ తదితరులు పాల్గొన్నారు.

సమష్టి కృషితోనే అద్భుత ఫలితాలు

సీపీఐ జిల్లా కార్యాలయానికి వెళ్లి అక్కడ నాయకులకు, కార్యకర్తలకు మంత్రి పొంగులేటి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో మంత్రి మాట్లాడుతూ అసెంబ్లీ ఎన్నికల్లో సీపీఐ, కాంగ్రెస్ సమష్టిగా పనిచేశాయని, కొత్తగూడెంలో సీపీఐ అభ్యర్థి కూనంనేని విజయంకోసం కాంగ్రెస్ శ్రమించిందన్నారు. అలాగే మిగిలిన నియోజకవర్గాల్లో కాంగ్రెస్ విజయానికి సీపీఐ సహకరించిందన్నారు. లోక్‌సభ ఎన్నికల్లోనూ సీపీఐతోపాటు ఇతర వామపక్షాలు కాంగ్రెస్‌తో కలిసి పనిచేయాల్సిన అవసరం ఉందన్నారు. వామపక్షాలు కోరుకునే సంక్షేమ పథకాలు అభయహస్తం రూపంలో ప్రజలకు అందుతాయన్నారు. ఈ సమావేశంలో కాంగ్రెస్ నాయకులు రాయల నాగేశ్వరరావు, బొర్రా రాజశేఖర్, తుళ్లూరి బ్రహ్మయ్య, సీపీఐ రాష్ట్ర కమిటీ సభ్యుడు బాగం హేమంతరావు, జిల్లా కార్యదర్శి పోటు ప్రసాద్, మహ్మద్ మౌలానా, దండి సురేష్ పాల్గొన్నారు. అనంతరం సీపీఐ ఎంఎల్ ప్రజాపంథా కార్యాలాయానికి వెళ్లిన మంత్రి పొంగులేటి ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలకు కృతజ్ఞతలు తెలిపారు. ప్రజాపంథా రాష్ట్ర కార్యదర్శి పోటు రంగారావు, జిల్లా కార్యదర్శి గోకినపల్లి వెంకటేశ్వరరావు, గుర్రం అచ్చయ్య, రామయ్య, ఆవుల అశోక్, పుసునూరి నరేందర్, వెంకటేష్, మనోహర్‌రాజు, రవికుమార్, తుళ్లూరి బ్రహ్మయ్య, రాయల నాగేశ్వరరావు, ఎమ్డీ జావీద్ పాల్గొన్నారు.



కొత్తగూడెంలో ప్రయోగ పరీక్షను తనిఖీ చేస్తున్న జిల్లా నోడల్ అధికారి సులోచనారాణి

ఇంటర్ ప్రాక్టికల్స్ షురూ

ఖమ్మం ఖానాపురం హవేలీ/కొత్తగూడెం పోస్టాఫీస్ సెంటర్, ఫిబ్రవరి 1: ఇంటర్మీడియెట్ ప్రయోగ పరీక్షలు గురువారం ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి.ఇరుజిల్లాల్లో మొత్తం 137కేంద్రాల్లో ఈ పరీక్షలు నిర్వహించారు. ఖమ్మం జిల్లాలో మొత్తం 76 కేంద్రాల్లో ఉదయం నిర్వహించిన పరీక్షకు 2,580మందికిగాను 2,315మంది, మధ్యాహ్నం పరీక్షకు 1,804మందికిగాను 1,694మంది హాజరయ్యారని జిల్లా ఇంటర్ అధికారి రవిబాబు తెలిపారు. ప్రయోగ గదుల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి పరీక్షలు నిర్వహించినట్లు తెలిపారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో తొలిరోజు ఉదయం 2,112 మంది విద్యార్థులకు 297మంది గైర్హాజరయ్యారు. ద్వితీయ సంవత్సరం 1,619మందికి 78 మంది గైర్హాజరయ్యారని జిల్లా ఇంటర్ అధికారి సులోచనా రాణి తెలిపారు.

ముగిసిన జేఈఈ మెయిన్స్

ఖమ్మం ఖానాపురం హవేలీ, ఫిబ్రవరి 1: ఖమ్మం జిల్లాలో గతనెల 24న ప్రారంభమైన మొదటి విడత జేఈఈ మెయిన్స్, బీఆర్క్ పరీక్షలు గురువారం ముగిశాయి. ఈ పరీక్షలు ప్రశాంతంగా నిర్వహించామని కో-ఆర్డినేటర్ పార్వతీరెడ్డి తెలిపారు. మొత్తం 9,029మంది విద్యార్థులకుగాను 8,892మంది పరీక్షలకు హాజరయ్యారని, 137మంది గైర్హాజరయ్యారని కో-ఆర్డినేటర్ తెలిపారు. మొత్తం 6పరీక్షా కేంద్రాల్లో ఈ పరీక్షలు నిర్వహించారు.

బీఆర్ఎస్‌కు మరో షాక్

- 'కారు' దిగిన డీసీసీబీ వైస్‌చైర్మన్ దొండపాటి
- పార్టీకి రాజీనామా చేస్తున్నట్లు ప్రకటన
- అదే బాటలో మధిర వైస్‌ఎంపీపీ, పలువురు సొసైటీ డైరెక్టర్లు



మధిరలో మీడియాతో మాట్లాడుతున్న డీసీసీబీ వైస్‌చైర్మన్ దొండపాటి వెంకటేశ్వరరావు, పక్కన వైస్ఎంపీపీ సామినేని సురేష్

మధిర రూరల్, ఫిబ్రవరి 1: జిల్లా సహకార వ్యవస్థలో అవిశ్వాసాల పర్వం కొనసాగుతున్నవేళ బీఆర్ఎస్ పార్టీకి మరో భారీ షాక్ తగిలింది. ఖమ్మం డీసీసీబీ వైస్‌చైర్మన్ దొండపాటి వెంకటేశ్వరరావు బీఆర్ఎస్ పార్టీకి రాజీనామా చేస్తున్నట్లు గురువారం ప్రకటించారు. మధిరలోని రిక్రియేషన్ క్లబ్‌లో గురువారం ఉదయం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ తాను బీఆర్ఎస్‌కు రాజీనామా చేశానని ప్రకటించారు. తన అనుచరులు, కార్యకర్తలతో చర్చించి భవిష్యత్‌పై నిర్ణయం తీసుకుంటానన్నారు. దొండపాటితో పాటు మధిర వైస్‌ఎంపీపీ సామినేని సురేష్, ఖమ్మంపాడు సహకార సంఘం వైస్‌చైర్మన్ పుచ్చకాయల సీతారామయ్య, డైరెక్టర్లు సామినేని జానయ్య, కంచం శ్రీనివాసరావు, బీఆర్ఎస్ మధిర మండల ఉపాధ్యక్షుడు పిడికిటి సాంబశివరావు, ఖమ్మంపాడు గ్రామశాఖ అధ్యక్ష, కార్యదర్శులు నూకవరపు అప్పారావు, మర్సకట్ల శ్రీను కూడా బీఆర్ఎస్ పార్టీకి రాజీనామా చేసినట్లు ప్రకటించారు. మధిర మండలం ఖమ్మంపాడు గ్రామానికి చెందిన దొండపాటి వెంకటేశ్వరరావు మధిర ప్రాంతంలో బలమైన నాయకుడిగా గుర్తింపు పొందారు. ఖమ్మంపాడు సహకార సంఘం నుంచి ఆయన ఏకగ్రీవంగా, ఆయన సతీమణి రుక్మిణమ్మ సర్పంచ్‌గా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఖమ్మంపాడు సహకార సంఘం అధ్యక్షుడిగా దొండపాటి మూడోసారి కొనసాగుతున్నారు. గతంలో ఆత్మకమిటీ చైర్మన్‌గా, టీడీపీ, బీఆర్ఎస్ పార్టీల తరఫున పార్టీ మండల అధ్యక్షుడిగా పనిచేశారు. దొండపాటి రాజీనామాతో బీఆర్ఎస్‌కు భారీగా షాక్ తగిలినట్లయింది. ఖమ్మంపాడుతోపాటు మధిర మండలంలోని పలు గ్రామాల్లో దొండపాటికి బలమైన కేడర్ ఉంది. మరో రెండునెలల్లో పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో దొండపాటి బీఆర్ఎస్‌కు రాజీనామా చేయడంతో మధిరల మండలంలో ఆ పార్టీ శ్రేణులు షాక్‌కు గురయ్యాయి.

ఖమ్మం నుంచి పోటీకి సై

- కేంద్ర మాజీ మంత్రి రేణుకాచౌదరి
- పార్టీశ్రేణుల వినతికి స్పందన



ఖమ్మం, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతిప్రతినిధి): రాబోయే లోక్‌సభ ఎన్నికల్లో ఖమ్మం నుంచి సోనియాగాంధీ పోటీ చేయని పక్షంలో.. మీరే బరిలోకి దిగాలని కేంద్ర మాజీ మంత్రి, రాజ్యసభ మాజీ సభ్యురాలు రేణుకాచౌదరిని కాంగ్రెస్ నాయకులు కోరారు. హైదరాబాద్‌లో రేణుకా చౌదరి నివాసంలో కాంగ్రెస్ నాయకులు సమావేశమయ్యారు. జిల్లాలోని ఆమె వర్గీయులు గురువారం హైదరాబాద్ వెళ్లారు. అంతకుముందు రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జ్ దీపాదాస్‌మున్షీ రేణుకాచౌదరి నివాసానికి రావడంతో జిల్లాకు చెందిన నాయకులు, కార్యకర్తలు ఆమెను కలిసి ప్రభుత్వ నియామక పదవుల్లో తమకు న్యాయం చేయాలని విజ్ఞప్తి చేశారు. రేణుకాచౌదరి ఖమ్మం లోక్‌సభ నియోజకవర్గం నుంచి వెళ్లిన ఆమె వర్గానికి చెందిన నాయకులు, కార్యకర్తలతో చర్చించారు.

ఖమ్మం లోక్‌సభ నుంచి సోనియాగాంధీని పోటీ చేయాలని ఇప్పటికే రాష్ట్ర పీసీసీ నుంచి ఆహ్వానించామని, సోనియా గాంధీ ఖమ్మం నుంచి పోటీ చేస్తే భారీ మెజారిటీతో గెలిపించుకునేదుకు కృషి చేద్దామని, కార్యకర్తలు, నాయకులకు సూచించారు. సోనియాగాంధీ పోటీ చేయని పక్షంలో ఖమ్మం టికెట్ అడిగే హక్కు తనకే ఉందని రేణుక అన్నారు. పార్టీ కష్టకాలంలో ఉన్నప్పుడు గత ఎన్నికల్లో పోటీ చేశానన్నారు. గత లోక్‌సభ ఎన్నికల ముందు కాంగ్రెస్ నుంచి గెలిచిన ఎమ్మెల్యేలు పార్టీని వీడినా కార్యకర్తల అండతో తాను పోటీ చేసి ఓటమి చెందానన్నారు. కాంగ్రెస్ బలం చూపించానని పేర్కొన్నారు. కార్యకర్తలను కాపాడుకున్నానన్నారు. ఖమ్మం నుంచి పోటీ చేసి మరోసారి కాంగ్రెస్ సత్తా చూపిస్తానని పేర్కొన్నారు.

విద్యుత్‌శాఖలో మిగిలిన **ఉద్యోగాల భర్తీ**
కోర్టు ఆదేశాలు, సీఎండీ చొరవతో జేఎల్ఎం అభ్యర్థులకు ఎంపిక పరీక్షలు

6

దానం అడిగితే **లైసెన్స్ రద్దు**
మంత్రి తుమ్మల ఆదేశాలతో కదలిన మార్కెట్ అధికారులు

చౌక చక్కెర చేదెక్కింది!

» సర్కారు అనాలోచిత నిర్ణయంతో గడువుతీరిన పంచదార » రూ. లక్షల ప్రజాధనం వృథా


వైరా ఎంఎల్ఎస్ గోదాములో కాలం చెల్లిన పంచదార బస్తాలు

వైరా, ఫిబ్రవరి 1: అన్నీ బాగుంటే ఆ చక్కెర పేదల చెంతకు చేరేది. వారి నోపిని తీపి చేసేది. వారి ఇంట్లో అవసరాలు తీర్చేది. కానీ ప్రభుత్వ అనాలోచిత నిర్ణయం వల్ల చక్కెర వృథా అయింది. తీపి నింపాల్సిన చోట చేదెక్కింది. ఎందుకూ పనికిరాకుండా పోయింది. గడువు మీరిన పంచదార విషతుల్యంగా మారింది. వైరా ఎంఎల్ఎస్ గోదాముల్లో లక్షలాది రూపాయల విలువైన పంచదార బస్తాలు పడి ఉన్నాయి. రేషన్‌షాపుల్లో వినియోగదారులకు ఈ పంచదార పంపిణీ చేయటానికి వీల్లేదని విజిలెన్స్ అధికారులు తనిఖీలు చేసి నిర్ధారించారు. కరోనా సమయంలో వైరా ఎంఎల్ఎస్ పాయింట్‌కు వచ్చిన 125 క్వింటాళ్ల చక్కెర గడువు తీరిపోయింది. అంత్యోదయ, అన్న యోజన(ఏఏవై) కార్డుదారులకు మాత్రమే రేషన్‌షాపుల్లో ఈ చక్కెర కిలో ఒక్కంటికి రూ.13.50పై పంపిణీ చేసేందుకు ఇక్కడ దిగుమతి చేశారు. అయితే వైరా ఎంఎల్ఎస్ పాయింట్ పరిధిలోని వైరా, తల్లాడ, కొణిజర్ల మండలాల్లోని ఏఏవై కార్డుల లబ్ధిదారులకు ఒక్కొక్కరికి కేవలం 500గ్రాముల చొప్పున మాత్రమే చక్కెర పంపిణీ చేయాల్సి రావడంతో డీలర్లు ముందుకు రాలేదు. 2020-21లో వచ్చిన 125 క్వింటాళ్ల చక్కెర బస్తాలు ఇప్పుడెందుకు పనికిరాకుండా విషతుల్యంగా మారాయి. బహిరంగ మార్కెట్లో ఈ చక్కెర విలువ రూ.ఐదు నుంచి రూ.ఆరులక్షల వరకు ఉంది. ఇన్నిలక్షల రూపాయల విలువైన చక్కెరను వినియోగదారులకు సకాలంలో సరిపోను పంపిణీ చేయని కారణంగా అది ఎందుకూ పనికిరాకుండాపోయింది. ప్రజాధనం వృథాఅయింది. అధికారుల అలసత్వం వల్ల లక్షల రూపాయల ప్రజాధనం వృథా కావడం పట్ల పలువురు విస్మయం వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయమై ఎంఎల్ఎస్ పాయింట్ ఇన్‌చార్జ్ శ్యామ్‌ను వివరణ కోరగా తమ గోదాంలో ఉన్న రేషన్ పంచదార విషయం తమ ఉన్నతాధికారులకు సమాచారం ఇచ్చామని తెలిపారు. విజిలెన్స్ అధికారులు తనిఖీ చేసి వెళ్లారని పేర్కొన్నారు.

మీరు దానం అడగొద్దు.. రైతులూ ఇవ్వొద్దు

» మార్కెట్‌లో ఇక నుంచి అడిగితే లైసెన్స్ రద్దు » మార్కెట్ సెక్రటరీ ప్రవీణ్‌రెడ్డి
» మంత్రి తుమ్మల ఆదేశాలతో ఖమ్మం మార్కెట్లో దానం రద్దుపై సమావేశం


మహిళా స్వీపర్లు, రెల్లుడు కార్మికులకు దానం విధానం రద్దుపై అవగాహన కల్పిస్తున్న మార్కెట్ అధికారులు

ఖమ్మం మార్కెట్, ఫిబ్రవరి 1: 'మీరు దానం అడగొద్దు. రైతులు తమ పంటను దానం ఇవ్వొద్దని' మార్కెట్ సెక్రటరీ ప్రవీణ్‌రెడ్డి తేల్చి చెప్పారు. ఖమ్మం వ్యవసాయ మార్కెట్‌లో ఇక నుంచి దానం (ముష్టి విధానం) ఉండబోదని అందరూ సహకరించాలని మార్కెట్ అధికారులు సూచించారు. రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఆదేశాలతో గురువారం మార్కెట్‌లోని పత్తి యార్డులో మహిళా స్వీపర్లు, రెల్లుడు, హమాలీ కార్మికులు, కార్మిక సంఘాలతో మార్కెట్ సెక్రటరీ ప్రవీణ్‌రెడ్డి ప్రత్యేక సమావేశం నిర్వహించారు. మార్కెట్‌కు పంట అమ్ముకోడానికి వచ్చే రైతులను ఎవరైనా దానం అడిగినట్లు తెలిస్తే వారి లైసెన్సులను వెంటనే రద్దు చేస్తామని హెచ్చరించారు. లైసెన్స్ ఉన్న మహిళలనే గేటు లోపలికి రానిస్తామని, ఇతరులకు యార్డులలోకి నో ఎంట్రీ అని తెలిపారు. రెల్లుడు కార్మికులకు, కలాసులకు, స్వీపర్లకు ఎవరైనా హమాలీలు రైతుకు చెందిన పంటను దానం రూపంలో ఇస్తే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కాంటాల ప్రక్రియ ముగిసిన వెంటనే సదరు కార్మికులు యార్డులను విడిచి వెళ్లాలని సూచించారు. ఇప్పట్నుంచి ఈ నిబంధనలు అమల్లోకి వస్తాయని నిబంధనలు ఉల్లంఘిస్తే చట్ట పరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో గ్రేడ్-2 సెక్రటరీ బజారు, కార్మిక సంఘాల నాయకులు ఎర్రా శ్రీకాంత్, నున్నా మాధవరావు, దిగుమతి శాఖ బాధ్యులు దిరిశాల వెంకటేశ్వర్లు, ఉప్పల్‌రావు పాల్గొన్నారు.

విద్యుత్‌శాఖలో మిగిలిన ఉద్యోగాల భర్తీ

» కోర్టు ఆదేశాలు, సీఎండీ చొరవతో జేఎల్‌ఎం అభ్యర్థులకు ఎంపిక పరీక్షలు
» ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 23 మందికి 20మంది హాజరు


అధికారుల పర్యవేక్షణలో విద్యుత్ స్తంభం ఎక్కుతున్న అభ్యర్థి

ఖమ్మంసంక్షేమవిభాగం, ఫిబ్రవరి 1: జిల్లాలోని విద్యుత్ శాఖలో పెండింగ్‌లో ఉన్న జేఎల్‌ఎం ఉద్యోగాల ఎంపిక ప్రక్రియను ఎన్‌పీడీసీఎల్ కార్యాలయంలో గురువారం నిర్వహించారు. 2018లో రాష్ట్ర వ్యాప్తంగా ఖాళీగా ఉన్న 2,553 జేఎల్‌ఎం ఉద్యోగాల భర్తీకి ప్రకటన విడుదల చేశారు. వాటిని తొలి విడతగా ఒక ఉద్యోగానికి ఒక్క అభ్యర్థిని ఎంపిక పరీక్షలకు పిలవటంతో వచ్చిన వారిలో కేవలం 50 శాతం వరకు అర్హత సాధించి ఉద్యోగాలు పొందారు. తర్వాత రెండు, మూడు విడతల్లో నిర్వహించిన పరీక్షల్లోనూ మొత్తం 80శాతం అభ్యర్థులు ఉద్యోగాలు పొందా రు. కాగా ఆ నాటి ప్రకటన మేరకు ఉమ్మడి జి ల్లాలో మరో 23 జేఎల్‌ఎం ఖాళీలు మిగిలాయి. దీంతో ప్రక టన ప్రకారం దరఖాస్తులు చేసిన అభ్యర్థులు కోర్టును ఆశ్రయించారు. కోర్టు తీర్పు మేరకు సీఎండీ వరుణ్‌రెడ్డి చొరవతో ఖమ్మం విద్యుత్‌శాఖ కార్యాలయంలో నాలుగో విడత ఎంపిక ప్రక్రియను ఎస్ఈ సురేందర్ ఆధ్వర్యంలో నిర్వహించారు. మొత్తం 23మంది అభ్యర్థులకు గానూ 20 మంది హాజరయ్యారు. వీరికి విద్యుత్ స్తంభాలు ఎక్కించటం, ఇతర పరీక్షలు ఏర్పాటు చేశారు. దీంతో కొంతమంది మాత్రమే ఉద్యోగాలకు అర్హత సాధించి ఎంపికైనట్లు తెలుస్తోంది.

ఖమ్మం పార్లమెంట్ అభ్యర్థిత్వం కోసం మల్లు నందిని దరఖాస్తు


మల్లు నందిని తరఫున దరఖాస్తు చేస్తున్న జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్

మధిరటౌన్, ఫిబ్రవరి1: కాంగ్రెస్ పార్టీ ఖమ్మం పార్లమెంట్ అభ్యర్థిత్వం కోసం ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క సతీమణి మల్లు నందిని తరుపున జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్ గురువారం దరఖాస్తు అందచేశారు. హైదరాబాద్ లోని గాంధీభవన్‌లో ఖమ్మం పార్ల మెంట్ కు కాంగ్రెస్ పార్టీ తరపున పోటీ చేసే అవకాశం మల్లు నందినికి కల్పించాలని దరఖాస్తు అందచేశారు. పదిహేను సంవత్సరాలుగా జిల్లాలో కాంగ్రెస్ పార్టీని బలోపేతం చేసేందుకు ఆమె కృషి చేశారని, కార్యకర్తలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉండే నందిని అయితే ఖమ్మం పార్లమెంట్ సీటును కాంగ్రెస్ పార్టీ అత్యధిక మెజారిటీతో కైవసం చేసుకుంటుందని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ అధికార ప్రతినిధి వేమిరెడ్డి శ్రీనివాసరెడ్డి, జిల్లా కాంగ్రెస్ ఎస్సీ సెల్ అధ్యక్షుడు బొందయ్య, జిల్లా కాంగ్రెస్ నాయకులు శీలం వెంకట నర్సి రెడ్డి, వడ్డే నారాయణ, యూత్ కాంగ్రెస్ మధి ర నియో జకవర్గ అధ్యక్షుడు తూమాటి నవీన్ రెడ్డి పాల్గొన్నారు.

ఇసుక అక్రమ రవాణాకు వెళ్తున్న లారీల పట్టివేత


బోనకల్ పోలీసుల అదుపులో లారీ డ్రైవర్

బోనకల్, ఫిబ్రవరి1: అక్రమంగా ఇసుక తోలకాలను జరిపేందుకు వెళ్తున్న నంబర్ ప్లేట్లు లేని మూడు లారీలను పోలీసులు సీజ్ చేశారు. ఈమేరకు వివరాలను వైరా ఏసీపీ అబ్దుల్ రెహమాన్ వెల్లడించారు. రాత్రివేళల్లో ఆంధ్రా నుంచి ఖమ్మానికి అక్రమంగా ఇసుక తరలిస్తున్నందున సరిహద్దు పోలీస్ స్టేషన్ల సిబ్బందిని అప్రమత్తం చేసేందుకు గానూ గురువారం ఆయన వాహనాల తనిఖీ చేపట్టారు. మండల పరిధిలోని మధిర క్రాస్ రోడ్డు వద్ద నంబర్ ప్లేట్లు లేని మూడు లారీలు కనిపించగా తనిఖీలు చేసి, విచారణ నిర్వహించారు. రాత్రివేళల్లో ఆంధ్రా ప్రాంతంలోని పలు ఇసుక రీచ్‌ల నుంచి బోనకల్ మీదుగా తెలంగాణకు లారీల రాకపోకలు సాగిస్తున్నట్లు తమకు సమాచారం అందినట్లు ఏసీపీ తెలిపారు. నిబంధనలకు విరుద్ధంగా అక్రమ తోలకాలు చేస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఆంధ్రాలోని నందిగామ రీచ్‌కు లారీలు వెళ్లేందుకు సిద్ధం చేసుకున్నట్లు పోలీసుల విచా రణలో తేలింది. తోలకాలు జరిపే క్రమంలో ప్రమాదాలు జరిగినా సీసీ కెమెరాలకు దొరకకుండా, పోలీసులు విధించే చలానాల నుంచి తప్పించుకునేందుకు నంబర్ ప్లేట్లు లేకుండా లారీలను సిద్ధం చేసుకున్నట్లు విచారణలో నిందితులు వెల్లడించారు. ఈ సంఘటనకు సంబంధించి బండి కొండలరావు, చలమల సుమంత్, యాఱ్ర మహేం దర్, సతీష్, సుదర్శన్‌ల పై పలు సెక్షన్ల కింద కేసు నమోదు చేసి లారీలను సీజ్ చేసినట్లు ఏసీపీ రెహమాన్ తెలిపారు. ఇసుక అక్రమ రవాణా చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు.

సువర్ణాపురంలో..


ఇసుక లారీలు, ట్రాక్టర్లను పరిశీలిస్తున్న ముదిగొండ ఎస్ఐ

ముదిగొండ, ఫిబ్రవరి 1: ముదిగొండ మండలం సువర్ణాపురం వద్ద ఇసుకను అక్రమంగా తరలిస్తున్న మూడు లారీలు, మూడు ట్రాక్టర్లను ఎస్ఐ నరేష్ గురువారం పట్టుకున్నారు. ఆంధ్రా నుంచి ఖమ్మానికి అక్రమంగా ఇసుకను తరలిస్తున్నారనే సమాచారం మేరకు మూడు లారీలతో పాటు మండలంలోని పెద్దమండవ-గంధసిరి మున్నేరు నుంచి ఇసుకను తరలిస్తున్న మరో మూడు ట్రాక్టర్లను పట్టుకొని కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు. ఇసుక అక్రమ రవాణా చేపడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

డబుల్ ఇళ్లను ఆక్రమించుకున్నారని తహసీల్దార్‌కు ఫిర్యాదు


తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న గ్రామస్థులు

పెనుబల్లి, ఫిబ్రవరి 1: ఏరుగట్ల గ్రామంలో నిర్మించిన డబుల్‌బెడ్‌రూం ఇళ్లను దౌర్జన్యంగా కొంతమంది ఆక్రమించుకున్నారని ఆగ్రామానికి పలువురు గురువారం తహసీల్దార్ గంటా ప్రతాప్‌కు ఫిర్యాదు చేశారు. ఈమేరకు ఒక వినతిపత్రం సమర్పించారు. ఏరుగట్ల గ్రామానికి చెందిన ఎస్సీ, ఎస్టీ, బీసీ కులాలవారికి 2018లో మంజూరు చేశారు. వాటి నిర్మాణం ఇటీవలనే పూర్తయింది. వాటిని ఇతర గ్రామాలకు చెందిన కొందరు ఆక్రమించుకున్నారని వారిని తొలగించి గ్రామానికి చెందిన అర్హులైన వారికి కేటాయించాలని కోరారు. కార్యక్రమంలో ముత్తమ్మ, వీరయ్య, మరియమ్మ, కృష్ణవేణి, నీలాద్రి, సైదులు, వెంకటేశ్వరరావు ఉన్నారు.

ఆగి ఉన్న కారును ఢీకొన్న మరో కారు: ఇద్దరికి గాయాలు

పెనుబల్లి, ఫిబ్రవరి 1: ఆగిఉన్న కారును మరో కారు ఢీకొంది. ఈఘ టనలో ఇద్దరికి గాయాలయ్యాయి. ఈ సంఘటన గురువారం రాత్రి వీఎం బంజర్‌లో చోటుచేసుకుంది. మండలంలోని కేఎంబంజర్‌కు చెందిన తన్నీరు శ్రీనివాసరావు తన భార్య పుట్టినిల్లు భవన్నపాలెం వెళ్లి భార్యతో పాటు పార్థసారథిపురానికి చెందిన తెల్లగొర్ల కవితతో కలిసి కారులో ఖమ్మం వెళ్లి తిరిగి ఇంటికి వెళ్తున్న సమయంలో వీఎంబంజర్‌లోని సత్తుపల్లి రోడ్డులో టిఫిన్ సెంటర్ వద్ద కారును నిలిపారు. నిలిపిన కారులోనే శ్రీనివాసరావు, కవిత, బాబు ఉన్నారు. ఇదే సమయంలో సత్తుపల్లి నుంచి వచ్చిన కారు ఢీకొనడంతో కారులో ఉన్న శ్రీనివాసరావు తలకు తీవ్రగాయాలు కాగా కవితకు కూడా గా యాలయ్యాయి. శ్రీనివాసరావు 8నెలల కుమారుడు కూడా అస్వస్థతకు గురయ్యాడు. వీరిని పెనుబల్లి ఆసుప త్రికి తరలించి వైద్యసే వలందించారు. ఇదిలా ఉండగా ఢీకొట్టిన కారు ఆగకుండా వెళ్లిపోయింది.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి


లాల్ కోటి(ఫైల్)

ఏన్కూరు, ఫిబ్రవరి 1: డాబా పై నుంచి పడి ఓ వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఈసంఘటన మండల పరిధిలోని సూర్య తండాలో గురువారం జరిగింది. తండాకు చెందిన లాల్ కోటి(35) జనవరి 26న తన డాబాపై పడుకున్నాడు. అర్ధరాత్రి ఒంటి గంట సమయంలో మూత్ర విసర్జన కోసం లేచాడు. నిద్ర మత్తులో డాబా పై నుంచి కింద పడ్డాడు. తలకు తీవ్రగాయాలు కావడంతో కుటుంబ సభ్యులు ఆసుపత్రికి తరలించారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతూ గురువారం మృతి చెందాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు ఎస్ఐ బాదవత్ రవి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

బావిలో పడిన ఆటో: తప్పిన పెనుప్రమాదం

ముదిగొండ, ఫిబ్రవరి 1: ముదిగొండ మండలం గంధసిరి సమీపంలో గురువారం సాయంత్రం ప్రమాదవశాత్తూ ఓ ఆటోలో బావిలో పడింది. కోదాడ మండలం గోవింద్రాలకు చెందిన కొందరు కూలీలు పని నిమిత్తం గంధసిరికి ఆటోలో వచ్చారు. పని ముగించుకొని సాయంత్రం ఇంటికి వెళ్లే సమయంలో కూలీలు ఆటో ఎక్కుతుండగా స్టార్ట్ అయి ప్రమాదవశాత్తూ బావిలోకి దూసుకెళ్లింది. ఆ సమయంలో ఆటోలో ఎవరూ లేకపోవడంతో పెనుప్రమాదం తప్పింది. బావిలో పడిన ఆటోను చుట్టూపక్కల రైతులు వచ్చి బయటకు తీశారు.

తుమ్మల ఫ్లెక్సీ తొలగింపు: పోలీసుల అదుపులో నిందితుడు

రఘునాథపాలెం, ఫిబ్రవరి 1: రేగులచెలకలో ఫ్లెక్సీల వివాదం కొలిక్కి వచ్చింది. గ్రామంలో కాంగ్రెస్ నాయకులు సత్యం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన రాష్ట్ర మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఫ్లెక్సీలను గుర్తు తెలియని వ్యక్తులు రాత్రి సమయంలో చించేశారు. దీంతో గ్రామంలో వివాదం నెలకొంది. ఇదిలా ఉండగా ఇటీవల ప్రధాన రహదారిలోని సీసీ కెమెరాలను పోలీసులు పరిశీలించగా రాష్ట్ర మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఫ్లెక్సీలను చించిన నిందితుడిని గుర్తించారు. రేగులచెలకకు చెందిన నున్నా కిశోర్‌గా గుర్తించారు. అతడిని అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం.

కొత్తగూడెంలో భారీగా గంజాయి స్వాధీనం?

కొత్తగూడెం పోస్టాఫీస్ సెంటర్, ఫిబ్రవరి 1: జిల్లా కేంద్రమైన కొత్తగూడెం సమీప ప్రాంతాల్లో టాస్క్‌ఫోర్స్, ఎక్సైజ్, త్రీటౌన్ పోలీసులు గురువారం తనిఖీలు చేపట్టగా ఓ వాహనంలో భారీగా గంజాయి స్వాధీనం చేసుకున్నట్లు సమాచారం. ఆంధ్రా ప్రాంతంలోని చింతూరు నుంచి ఇల్లెందు క్రాస్ రోడ్డు మీదుగా వెళ్తున్న ఈ వాహన్నాని పోలీసులు ఆపే ప్రయత్నం చేశారు. డ్రైవర్ వాహన వేగాన్ని పెంచి తప్పించే ప్రయత్నం చేయగా గణేష్ టెంపుల్ వద్ద ఆ వాహనాన్ని అదుపులోకి తీసుకొని స్వాధీనం చేసు కున్నట్లు తెలుస్తున్నది. ఈ విషయమై అధికారులను వివరణ కోరగా జిల్లా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు దర్యాప్తు చేసి పూర్తి వివరాలు వెల్లడిస్తామని తెలిపారు.

ప్రభుత్వ స్థలాలను ఖాళీ చేయాలి

» ఆక్రమణదారులకు ఖమ్మం అదనపు కలెక్టర్ హెచ్చరిక » రెండు రోజుల గడువు విధిస్తూ అవకాశం


కారేపల్లి క్రాస్‌రోడ్డులో గ్రామస్థులతో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ సత్యప్రసాద్

కారేపల్లి, ఫిబ్రవరి1: మండల పరిధిలోని విశ్వనాథపల్లి గ్రామపంచాయతీ కారేపల్లి క్రాస్‌రోడ్డులోగల ప్రధాన రహదారికి ఇరువైపులా ప్రభుత్వ స్థలాన్ని ఆక్రమించుకుని నిర్మాణాలు చేపట్టిన వారు రెండురోజులలో ఖాళీచేయాలని అదనపు కలెక్టర్ సత్యప్రసాద్ ఆదేశించారు. గురువారం జిల్లా ఆర్‌అండ్‌బీ అధికారులు, తహసీల్దార్ వి.సురేష్ కుమార్, సంబంధిత రెవెన్యూ సిబ్బందితో కలిసి ఆక్రమిత స్థలాలను పరిశీలించారు. స్థానికులతో ఆయన మాట్లాడుతూ అనేక ఏళ్లుగా ప్రభుత్వస్థలాన్ని ఆక్రమించుకుని నిర్మాణాలు ఏర్పాటు చేసుకున్న వారు రెండు రోజులలో వారంతట వారే ఖాళీచేయాలని, లేకుంటే పోలీసుల సహకారంతో తామే తొలగిస్తామని హెచ్చరించారు.

రోడ్డు పక్కన అక్రమణలను వెంటనే తొలగించాలి

కామేపల్లి, ఫిబ్రవరి 1: ఇల్లెందు-ఖమ్మం ప్రధాన రహదారి వెంబడి రోడ్డు అక్రమణలను వెంటనే తొలగించాలని అడిషనల్ కలెక్టర్ సత్యప్రసాద్ సూ చించారు. గురువారం పండితాపురం, ముచ్చర్ల క్రాస్‌రోడ్, కొత్తలింగాల క్రాస్‌రోడ్లను పరిశీలించారు. రోడ్డు వెంబడి ఉన్న షాపులను తొలగించాలని దుకాణాదారులకు సూచించారు. ఆక్రమణల వల్ల రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయని అన్నారు. ఈ పరిశీలనలో ఆర్‌ఎండ్‌బీ డిప్యూటీ ఈఈ జి. చంద్రశేఖర్, ఎంపీడీవో విజయభాస్కర్‌రెడ్డి, జేఈ వరప్రసాద్, పంచాయతీ కార్యదర్శి నెహ్రూ, ఫీల్డ్ అసిస్టెంట్ దారావత్ మాన్‌సింగ్ పాల్గొన్నారు.

రేణుకాచౌదరి ఇంటికి దీపాదాస్ మున్షి


దీపాదాస్ మున్షిని సన్మానిస్తున్న సూరంపల్లి రామారావు

ఖమ్మంసంక్షేమవిభాగం/ అశ్వారావుపేట/ వైరా/ కొణిజర్ల, జనవరి1: రాష్ట్ర కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌చార్జ్ దీపాదాస్‌మున్షి గురువారంహైదరాబాద్‌లోని కేంద్ర మాజీ మంత్రి రేణుకాచౌదరి నివాసానికి వెళ్లారు. ఈ సందర్భంగా వారిరువురు పలు రాజకీయపరమైన విషయాలను మాట్లాడుకున్నా రు. ఖమ్మం ఏఎంసీ మాజీ చైర్మన్ మానుకొండ రాధాకిషోర్, నాయకులు తమ్మిని నాగేశ్వరరావు, బండి నాగేశ్వరరావు, చల్లగుండ్ల శ్రీనివాసరావు, దుంపటి నగేష్, ఆరిగల్ల ప్రేమ్‌కుమార్, దీప్లానాయక్, పత్తి శ్రీనివాసరావు, ఎండీ ముస్తాఫా, సురేంద్ర రేణాకాచౌదరి నివాసంలో మున్షిని కలిసి పుష్పగుచ్ఛాలను అందించారు. దీపాదాస్ మున్షిని వైరా కాంగ్రెస్ నాయకుడు కట్ల రంగారావు, ఖమ్మం పార్లమెంట్ చైర్మన్ సూరంపల్లి రామారావు, సూపర్ జెమ్స్ వ్యవస్థాపకుడు, చైర్మన్ కొణతం ఉమాశంకర్ కలిశారు. నియోజక వర్గంలో పార్టీ పరిస్థితి వివరించి, సన్మానిం చారు. రంగారావు వెంట కట్ల సంతోష్, నాగరాజు, దరావత్ రవికుమార్ ఉన్నారు. దీపాదాస్ మున్షిని అశ్వారా వుపేట సీనియర్ కాంగ్రెస్ నాయకుడు జేష్ట సత్యనారాయణ చౌదరి కలిశారు. సత్యనారాయణ చౌదరి వెంట రాంబాబు, శ్రీనివాస్, సత్యనారాయణ, సోమేశ్వరరావు ఉన్నారు.

టీడీపీ, సీపీఐ, సీపీఐఎంఎల్, టీడీపీ నేతలకు పొంగులేటి కృతజ్ఞతలు





ప్రజాపంథా కార్యాలయంలో మాట్లాడుతున్న పొంగులేటి, సీపీఐ కార్యాయలయంలో పొంగులేటిని సన్మానిస్తున్న హేమంతరావు, తదితరులు

అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి మద్దతు తెలిపినందుకు మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి గురువారం ఖమ్మంలోని టీడీపీ, సీపీఐ, సీపీఐఎంఎల్ ప్రజాపంథా కార్యాలయాలకు వెళ్లారు. ఆ పార్టీల నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు. ముందుగా టీడీపీ కార్యాలయంలో ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలువేసి నాయకులు, కార్యకర్తలతో మాట్లాడారు. మార్పు కోసం 119 నియోజకవర్గాల్లో కాంగ్రెస్‌కు మద్దతు ఇచ్చి ప్రజలు కోరికను నెరవేర్చారన్నారు.

-ఖమ్మం మామిళ్లగూడెం/ఖమ్మం సంక్షేమ విభాగం

దేవాలయ భూముల్లో తవ్వకాలపై ఉమ్మడి సర్వే

» మంత్రి పొంగులేటి ఆదేశాలతో రంగంలోకి అధికారులు
» మట్టి తరలించిన ప్రాంతాల పరిశీలన

కూసుమంచి, ఫిబ్రవరి 1: మండలంలోని జీళ్లచెరువు గ్రామంలో సీతారామచంద్రస్వామి దేవస్థానం ఆలయ భూముల్లో అక్రమ తవ్వకాలపై రెవిన్యూ, మైనింగ్, దేవాదాయశాఖ అధికారులు పరిశీలించారు. దేవాస్థానానికి సంబంధించి సుమారు 80 ఎకరాలు భూమి ఉంది. ఇటీవల పలువురు నాయకులు అక్రమంగా దేవాలయ భూముల్లో తవ్వకాలు జరిపి కోట్ల విలువైన మట్టిని అమ్ముకున్నారంటూ ఇటీవల రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డికి ఫిర్యాదు చేశారు. స్పందించిన మంత్రి విచారణ చేయాలని కలెక్టర్ గౌతమ్‌ను ఆదేశించారు. ఈక్రమంలో కలెక్టర్ ఆదేశాల మేరకు గురువారం ఖమ్మం ఆర్డీవో గణేష్, దేవాదాయ కమిషనర్ సులోచన, ఇన్‌స్పెక్టర్ సమత, మైనింగ్ అధికారి గంగాధర్, తహసీల్దార్ సంపత్‌కుమార్ తదితరులు తవ్వకాలు జరిగిన స్థలాన్ని పరిశీలించారు. ఈసందర్భంగా ఉమ్మడి అన్నిశాఖల ఆధ్వర్యంలో సర్వే నిర్వహించాలని నిర్ణయించి ఈమేర కు ఆదేశాలు ఇచ్చారు. పలువురు గ్రామస్థులు అక్రమాలు జరిగిన ప్రాంతాలను అధికారులకు చూపించారు. మట్టి అక్రమార్కులపై నిగ్గు తేల్చి చర్యలు తీసుకోవాలని జిల్లా కాంగ్రెస్ నాయకులు జొన్నలగడ్డ రవికుమార్ డిమాండ్ చేశారు. అక్రమంగా దేవుడి మాన్యాల్లో కోట్ల విలువైన మట్టి అమ్ముకున్నారని ఆరోపించారు.

ఇంటి పన్నుల వసూళ్లపై దృష్టిపెట్టండి: ఖమ్మం కమిషనర్

ఖమ్మంకార్పొరేషన్, ఫిబ్రవరి1: జీవో 58 ద్వారా క్రమబద్ధీకరణ చేసిన ఇళ్ల ఆస్తిపన్నుల వసూళ్లపై దృష్టి పెట్టాలని నగరపాలకసంస్థ కమిషనర్ ఆదర్శ్‌సురభి పేర్కొన్నారు. గురువారం నగరపాలకసంస్థ కార్యాలయంలో ఆర్‌ఐలు, బిల్ కలెక్టర్లు, సిస్టమ్ ఆపరేటర్లతో కమిషనర్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ జీవో 58 ద్వారా క్రమబద్ధీకరణ జరిగి, ఇంటినెంబర్ లేని వారికి వెంటనే ఇంటినెంబరు కేటాయించాలన్నారు. ఇంటి నెంబరు ఉండి, పన్నులు చెల్లించని వారి వద్ద నుంచి ఆస్తిపన్నులు వసూలు చేయాలన్నారు. జీవో 58ద్వారా ఎంతమంది దరఖాస్తు చేశారో విచారణ చేయా లని కమిషనర్ ఆదేశించారు. విచారణకు ప్రత్యేక బృందాల ను ఏర్పాటు చేసినట్లు కమిషనర్ ఆదర్శ్‌సురభి పేర్కొ న్నారు. ఈ బృందాలకు ఇద్దరు ఆర్‌ఐలను టీం లీడర్లుగా నియమించామన్నారు. ఒక్కొక్క ఆర్‌ఐ పరిధిలో మూడు బృందాలు ఉంటాయని, ఈ బృందాలకు సిస్టం ఆపరేట ర్లను ఇచ్చామన్నారు. జీవో 58పై ప్రత్యేకడ్రైవ్‌లో మొత్తం 24మంది ఉద్యోగులు పని చేస్తారన్నారు. ఆస్తిపన్ను ఎలా వసూలు చేయాలో ప్రత్యేక బృందాలకు ఈ సమావేశంలో ప్రొజెక్టర్ ద్వారా కమిషనర్ అవగాహన కల్పించారు. ఇంటి పన్నులు సకాలంలో చెల్లించే విధంగా నగర ప్రజలకు అవగాహన కల్పించాలని కమిషనర్ కోరారు. నూరు శాతం పన్ను వసూలయ్యేలా చర్యలు తీసుకోవాలన్నారు.

మేడారం బస్సు సర్వీసులపై ఆర్టీసీ ఈడీ సమీక్ష

ఖమ్మం ఖానాపురంహవేలి, ఫిబ్రవరి 1: సమ్మక్క సారలమ్మల జాతరకు ఉమ్మడి ఖమ్మం జిల్లా నుంచి ఎన్ని బస్సులను నడపాలి?, బస్సుల పా ర్కింగ్, వైద్య సేవలు తదితర అంశాలపై గురువారం కరీంనగర్ ఎగ్జిక్యూ టివ్ డైరెక్టర్ రఘునాథ్‌రావు డిపో మేనేజర్లతో సమావేశం నిర్వహించారు. అనంతరం నగరంలోని నూతన బస్టాండ్, సిటీ బస్టాండ్‌లను సందర్శిం చారు. డిపోలోని రాత్రి డ్యూటీలో ఉన్న మెకానిక్‌లతో మాట్లాడారు. డ్రైవ ర్లు సంతృప్తి చెందేలా బస్సులను నిర్వహించాలన్నారు. బస్సులు దూర ప్రాంతం వెళ్తున్న నేపథ్యంలో కండీషన్ చెక్ చేసుకోవాలన్నారు. బస్సుల మరమ్మతులను నిబద్ధతతో చేయాలని సూచించారు. ప్రయాణికులకు మెరుగైన ప్రయాణ అనుభూతిని కల్పించడం ఉద్యోగులకు మన విధి అన్నారు. అప్పుడే ఆర్టీసీ అంటే ప్రయాణికుల్లో నమ్మకం కలుగుతుందన్నారు. జాతరలో తీసుకోవాల్సిన వైద్య సూచనలపై కరపత్రం ఆవిష్కరించారు. మేడారం జాతరకు బస్సులు నడిపే డ్రైవర్లు జాగ్రత్తగా ఉండాలన్నారు. భారీగా వాహనాలు వచ్చే నేపథ్యంలో ఏకాగ్రతను కోల్పోవద్దని సూచించారు. లేనిపక్షంలో ప్రమాదాలు జరిగే ఆస్కారం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్‌ఎం వెంకన్న, డిప్యూటీ ఆర్‌ఎం, డిపోల మేనేజర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

భారత్‌కు 31 సాయుధ డ్రోన్లు

వాషింగ్టన్, ఫిబ్రవరి1: వాస్తవాధీన రేఖ వెంబడి చైనాకు చెక్ పెట్టేందుకు.. హిందూ మహాసముద్రంలో పట్టు పెంచుకునేందుకు ఇండియాకు ఎంతగానో ఉపయోగపడే ఎమ్‌క్యూ-9బి ప్రిడేటర్ డ్రోన్లను విక్రయించడానికి అమెరికా ప్రభుత్వం గురువారం ఆమోదం తెలిపింది. ఈ డీల్ కింద 3.99 బిలియన్ డాలర్ల (సుమారు రూ.33వేల కోట్లు) విలువైన 31 డ్రోన్లను అమెరికా సరఫరా చేయనుంది. ఎమ్‌క్యూ-9బి రిమోట్లీ పైలెటెడ్ ఎయిర్‌క్రాఫ్ట్‌గా పిలిచే ఈ సాయుధ డ్రోన్ల కొనుగోలుపై గత జూన్‌లో ప్రధాని మోదీ అమెరికాలో పర్యటన సందర్భంగా ఇరు దేశాల మధ్య అంగీకారం కుదిరింది. ఇందుకు అవసరమైన అనుమతి మంజూరు చేస్తూ అమెరికా కాంగ్రెస్ సర్టిఫికెట్ ఇచ్చిందని డిఫెన్స్ సెక్యూరిటీ కో-ఆపరేషన్ ఏజెన్సీ తాజాగా తెలిపింది. అమెరికా-భారత్ మధ్య వ్యూహాత్మక సంబంధాల బలోపేతంలో భాగంగా ఈ మెగా డ్రోన్‌డీల్ జరిగిందని పేర్కొంది. భారత్ భద్రతను పెంచేందుకు, ఇండో-పసిఫిక్, దక్షిణాసియా ప్రాంతంలో సుస్థిర, శాంతి, ఆర్థిక ప్రగతిని పెంపొందించేందుకు ఇది ఉపకరిస్తుందని తెలిపింది. మానవరహిత నిఘా విషయంలో భారత్ సామర్థ్యాలు మరింత బలోపేతమవుతాయని అభిప్రాయపడింది. సైన్యం ఆధునికీకరణకు భారత్ కట్టుబడి ఉందని, అందువల్ల వీటిని అందజేయడంలో తమకు ఇబ్బందేమీ లేదని పేర్కొంది. వీటిని హై ఆల్టిట్యూడ్ లాంగ్ ఎండ్యూరెన్స్ (హెచ్ఏఎల్ఈ-హేల్)యూఏవీలుగా వ్యవహరిస్తారు. ఈ 31లో 15 డ్రోన్లను సీగార్డియన్ల పేరుతో నేవీకి ఇస్తారు. స్కై గార్డియన్ పేరుతో ఎయిర్‌ఫోర్స్‌కు 8డ్రోన్లు, ల్యాండ్ వర్షన్ పేరుతో ఆర్మీకి మిగతా 8కేటాయిస్తారు. ఖలిస్థాన్ ఉగ్రవాది గురుప్రీత్ సింగ్ పన్నున్ హత్యకు భారత్ కుట్రపన్నుతున్నందున డ్రోన్లఅమ్మకాల ఒప్పందాన్ని అమెరికా నిలిపివేస్తుందంటూ వార్తలువచ్చిన నేపథ్యంలో కాంగ్రెస్ ఆమోదం లభించింది.

వీసా ఫీజులు భారీగా పెంచిన అమెరికా

వాషింగ్టన్, ఫిబ్రవరి1: అమెరికాకు వచ్చే విదేశీయుల నుంచి వసూలు చేసే నాన్-ఇమిగ్రెంట్ వీసా ఫీజులను బైడెన్ ప్రభుత్వం బుధవారం భారీగా పెంచింది. వీసా ఫీజులను పెంచడం 2016 తర్వాత ఇదే ప్రథమం. ఏప్రిల్1 నుంచి ఇవి అమల్లోకి వస్తాయి. భారతీయులకు అత్యంత ఉపయోగకరంగాఉండే హెచ్-1బీ, ఎల్-1, ఈబీ-5 వీసాల రుసుములు గణనీయంగా పెరిగాయి. విదేశాల వృత్తి నిపుణులు అమెరికాలో ఉద్యోగాలు చేయడానికి హెచ్-1బీ వీసాలు ఇస్తారు. ఇందుకు ఉద్దేశించిన ఫారం I-129 ఫీజు 460డాలర్ల (రూ.38,150)నుంచి 780డాలర్ల (రూ.64,690)కు పెరిగింది. హెచ్-1బీ వీసాల రిజిస్ట్రేషన్ రుసుము 10 డాలర్ల నుంచి 215 డాలర్ల (రూ.17,830)కు పెంచారు. ఈ నిర్ణయం వచ్చే ఏడాది నుంచి అమల్లోకి వస్తుంది. బహుళజాతి కంపెనీ ఉద్యోగుల బదిలీకి ఉద్దేశించిన ఎల్-1 వీసాల రుసుములు 460డాలర్ల నుంచి 1,385 డాలర్ల (రూ.1,14,860)కు పెరిగాయి. అమెరికా పౌరులకు ఉద్యోగాలిచ్చే వారికి ఈబీ-5 వీసాలు మంజూరు చేస్తారు. వీటి రుసుములు 3,675డాలర్ల నుంచి 11,160 డాలర్ల (రూ.9,25,510)కు పెరిగాయి. మరికొన్ని రకాల వీసాల ఫీజులు స్వల్పంగా తగ్గాయి.

10,11తేదీల్లో 'ప్రరవే' రాష్ట్ర మహాసభలు

ఖమ్మం సాంస్కృతికం ఫిబ్రవరి 1: మహిళాసమస్యల పరిష్కారం లక్ష్యంగా ప్రజా రచయిత్రుల వేదిక (ప్రరవే) రాష్ట్ర మహాసభలో ఖమ్మంలో ఈనెల 10, 11 తేదీల్లో జరుగనున్నాయి. రెండు వైరా రోడ్‌లోని వేదిక ఫంక్షన్ హాల్‌లో రోజుల పాటు జరిగే మహాసభల్లో రెండు పుస్తకాల ఆవిష్కరణలతో పాటు మహిళలపై ట్రోలింగ్ తదితర సమస్యలపై విస్తృత చర్చలు జరుగనున్నాయి. చర్చల్లో పాల్గొనేందుకు ఉమ్మడి రాష్ట్రానికి చెందిన తెలుగు సాహిత్య ప్రముఖులు హాజరవుతున్నారు.

అప్పారావుపేట గ్రామాభివృద్ధికి 28లక్షలు

దమ్మపేట, ఫిబ్రవరి 1: పామాయిల్ ఫ్యాక్టరీ ఆవాస ప్రాంతమైన అప్పారావుపేట గ్రామాభివృద్ధికి ఆయిల్‌ఫెడ్ 28లక్షల రూ.లు నిధులను కేటాయించింది. ఈనిధులతో గ్రామంలో సైడ్ డ్రైయిన్ల నిర్మాణం చేపట్టనున్నారు. ఆయిల్‌ఫెడ్ సీఎస్ఆర్ నిధుల కింది గ్రామానికి నిధుల కేటాయించారు.

16న ఖమ్మం జిల్లా బంద్


మాట్లాడుతున్న పోతినేని సుదర్శన్‌రావు

ఖమ్మం సంక్షేమవిభాగం, ఫిబ్రవరి1: బీజేపీ ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రజారైతు, కార్మిక వ్యతిరేక విధానాలను నిరసిస్తూ ఈనెల 16న నిర్వహిస్తున్న దేశవ్యాప్త బంద్‌లో భాగంగా ఖమ్మం జిల్లా బంద్‌ను నిర్వహిస్తున్నట్లు సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు పోతినేని సుదర్శన్‌రావు, సీపీఐ జిల్లా కార్యదర్శి పోటు ప్రసాద్, ప్రజాపంథా జిల్లా కార్యదర్శి గోకినపల్లి వెంకటేశ్వరరావు, బీఆర్ఎస్ నాయకులు ఉప్పల వెంకటరమణ ఎన్డీ నాయకులు గిరి ప్రకటిం చారు. గురువారం సీపీఎం కార్యాలయంలో నిర్వహించిన బీజేపీయేతర రాజకీయ పార్టీల సమావేశంలో ఈ నిర్ణయాన్ని ప్రకటించారు.

పేదింటి యువతికి నర్సింగ్ ఉద్యోగం



అశ్వారావుపేట, ఫిబ్రవరి 1: అశ్వారావుపేట మేజర్ పంచాయతీలో ట్రాక్టర్ డ్రైవర్‌గా(తాత్కాలిక ఉద్యోగి) పనిచేస్తున్న వేలేటి నాగభూషణం కుమార్తె ఉషారాణి నర్సింగ్ ఆఫీసర్ ఉద్యోగానికి ఎంపికయ్యారు. ఆమె బుధవారం సీఎం రేవంత్‌రెడ్డి సమక్షంలో ఈ నియామకపు పత్రాన్ని పొందారు. పేరాయిగూడేనికి చెందిన ఉషారాణి ఎంఎస్సీ సైకియాట్రీలో పీజీ చేశారు. ఉషారాణి భర్త అశోక్ కుమార్ ఇటీవలే ఎస్ఐగా ఎంపికయ్యారు.

వివాదాస్పద భూమి సర్వే

కొత్తగూడెం పోస్టాఫీస్ సెంటర్, ఫిబ్రవరి 1: చుంచుపల్లి మండలంలోని నందా తండా గ్రామ పంచాయతీ పరిధిలో హైకోర్టులో వివాదంలో ఉన్న స్థలాన్ని కొత్తగూడెం ఆర్డీవో శిరీష పర్యవేక్షణలో గురువారం రెవెన్యూ, పంచాయతీ అధికారులు సర్వే చేపట్టారు. కర్రి కోటేశ్వరరావు, మాలోతు శ్రీను ఇద్దరికి సంబంధించి 14ఎకరాల8 కుంటల స్థలంపై కోర్టులో వ్యాజ్యం నడుస్తోంది. ఇటీవల జిల్లా కలెక్టర్ ప్రియాంక అలా స్వయంగా కోర్టుకు హాజరయ్యారు. కాగా సర్వేలో సేకరించిన సమాచారం మొత్తాన్ని చుంచుపల్లి తహసీల్దార్ నేతృత్వంలో సీల్డ్ కవర్‌లో కలెక్టర్‌కు సమర్పించారు.

రాష్ట్రస్థాయి సాఫ్ట్‌బాల్ పోటీలకు స్రవంతి



ఖమ్మం స్పోర్ట్స్, ఫిబ్రవరి 1: మెదక్ జిల్లా తూప్రాన్‌లో ఈనెల 3వ తేదీ నుంచి జరగనున్న రాష్ట్రస్థాయి సాఫ్ట్‌బాల్ పోటీలకు నగరంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఫస్ట్ ఇయర్ విద్యార్థిని ఎడ్ల స్రవంతి ఎంపికైంది. స్రవంతి ఇటీవల మహారాష్ట్రలో జరిగిన జాతీయ పోటీల్లో సైతం స్వర్ణ పతకం సాధించి ప్రతిభ చూపడం విశేషం. స్రవంతికి కళాశాల ప్రిన్సిపాల్ అరుణ్‌కుమార్ నగదు సాయం అందించి అభినందించారు.

'కొలాబ్ ఫైల్స్' అప్లికేషన్‌పై అవగాహన

ఖమ్మం కలెక్టరేట్, ఫిబ్రవరి 1: 'కొలాబ్ ఫైల్స్ ఎన్ఐసీ వెబ్ అప్లికేషన్ అవగాహన పెంచుకోవడం ద్వారా పని సులభతరం అవడమే కాకుండా డేటా సురక్షితంగా ఉంటుందని అడిషనల్ స్టేట్ ఇన్ఫర్మేటిక్స్ అధికారి ర్యానిల్ జాన్, సీనియర్ టెక్నికల్ డైరెక్టర్ రాకేష్ పేర్కొన్నారు. దీన్ని అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో వినియోగించడం వల్ల కార్యాలయాల్లో పని వేగవంతంగా పూర్తవుతుందని అన్నారు. జిల్లా కలెక్టర్ వి.పి.గౌతమ్ ఆదేశాల మేరకు గురువారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా వివిధ శాఖల సిబ్బందికి ' కొలాబ్ ఫైల్స్ వెబ్ అప్లికేషన్‌'పై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు.

తెలుగు రాష్ట్రాల స్థాయి వాలీబాల్ క్రీడలు ప్రారంభం

కల్లూరు, ఫిబ్రవరి 1: కల్లూరులోని అంబేద్కర్‌నగర్‌లో యూత్ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన రెండు తెలుగు రాష్ట్రాల స్థాయి వాలీబాల్ క్రీడ పోటీలను సత్తుపల్లి ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి గురువారం ప్రారంభించారు. రాగమయి ప్రసంగిస్తూ విద్యతో పాటుగా ప్రతి యువత క్రీడల్లో రాణించాలని కోరారు. క్రీడాకారులకు ప్రభుత్వ ఎల్లప్పుడు ప్రోత్సాహం అందిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు పసుమర్తి చందర్‌రావు, భాగం ప్రభాకర్ చౌదరి, బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు నారాయణవరపు శ్రీనివాస్, ఉబ్బన గోపాలస్వామి, క్రీడా పోటీల నిర్వాహకులు పాపబత్తిని నగేష్, ఎంపీటీసీ దామాల రాజు జ్యోతి, ఎన్ రాజు, నవీన్ పాల్గొన్నారు.

గత ప్రభుత్వంలో విద్యారంగం నిర్వీర్యం: టీఎస్ యూటీఎఫ్

నేలకొండపల్లి, ఫిబ్రవరి1: గత ప్రభుత్వ హయాంలో విద్యారంగం నిర్వీర్యమైందని, ఉపాధ్యాయులు నిరాదరణకు గురయ్యారని టీఎస్ యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు నాగమల్లేశ్వరరావు అన్నారు. గురువారం నేలకొండపల్లి ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో నాగమల్లేశ్వరరావు మాట్లాడారు. బీఆర్ఎస్ ప్రభుత్వం ఉపాధ్యాయ సమస్యలను అసలు పట్టించుకోలేదన్నారు. ఉపాధ్యాయ పోస్టులు అనేకం ఖాళీగా ఉన్నాయన్నారు. మెగా డీఎస్సీకి ముందు ఉపాధ్యాయులకు పదోన్నతుల ప్రక్రియ పూర్తి చేయాలన్నారు. సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పారుపల్లి నాగేశ్వరరావు మాట్లాడుతూ ఈనెల 4న టీఎస్ యూటీఎఫ్ జిల్లా కమిటీ విస్తృత సమావేశాలను నేలకొండపల్లిలో నిర్వహిస్తున్నామన్నారు. 4వ తేదీ మధ్యాహ్నం ఉపాధ్యాయుల మహా ప్రదర్శన ఉంటుందన్నారు. ఈ సమావేశంలో రాష్ట్ర కమిటీ సభ్యుడు షేక్ రంజాన్, జిల్లా కార్యదర్శి సురేష్, జిల్లా కమిటీ సభ్యులు రావెళ్ల అరవిందకుమార్, తొర్తి గురవయ్య, విజయ్‌కుమార్, మంగేశ్వరి పాల్గొన్నారు.

కాంగ్రెస్ వలలో పడొద్దు

(మొదటి పేజీ తరువాయి)

చేయకండి. సీఎంను కలవాలనుకుంటే సమాచారం ఇచ్చి వెళ్లండి' అని సున్నితంగా హెచ్చరించినట్లు సమాచారం. "కాంగ్రెస్ ప్రభుత్వం చాలా సవాళ్లను ఎదుర్కొనాల్సి ఉంది. రాష్ట్ర ఆదాయం అంతంత మాత్రంగా ఉంది. కనీసం అంచనా వేయకుండానే ఇబ్బడిముబ్బడి హామీలిచ్చారు. అమలు చేయలేక ఇబ్బంది పడుతున్నారు. ప్రభుత్వం ఉంటుందా? ఉండదా? అనేది వారి చేతుల్లోనే ఉంది. ప్రతిపక్షంగా సమర్థంగా వ్యవహరిద్దాం. ఏడాది లోపే ప్రజలకు అసలు విషయం తెలుస్తుంది. మనం తొందరపడాల్సిన పనిలేదు. సంయమనం పాటిద్దాం. చక్కగా నిలబడితే చాలు.. వచ్చే ప్రభుత్వం మనదే"నని కేసీఆర్ పేర్కొన్నారు. ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా పాలించామని.. ఓడిపోయినంత మాత్రాన నిరుత్సాహం, భయడాల్సిన అవసరం లేదన్నారు. కృష్ణా ప్రాజెక్టులను కృష్ణా బోర్డుకు అప్పగించే అంశంపై పార్లమెంటులో నిరసన తెలపాలని ఎంపీలకు సూచించారు. కేంద్ర జల శక్తి శాఖ మంత్రినీ కలవాలని నిర్దేశించారు. లోక్‌సభ ఎన్నికల్లో గట్టిగా పోరాడదామని.. అందరితో చర్చించి, మంచి అభ్యర్థులను ప్రకటిస్తామని తెలిపారు.

అసాధ్యమని ఆర్బీఐనే చెప్పింది

రూ.36 వేల కోట్ల రైతు రుణమాఫీ అసాధ్యమని, ఏక మొత్తంలో ఇన్ని కోట్లు మాఫీ వీలుకాదని ఆర్‌బీఐ తెలిపిందని పార్టీ నేతల వద్ద కేసీఆర్ వ్యాఖ్యానించారు. అయినా.. ఏపీలో చెల్లించారు. తెలంగాణలోనూ రుణమాఫీ చేస్తామంటూ సీఎం రేవంత్‌రెడ్డి రైతాంగాన్ని తప్పుదారి పట్టిస్తున్నారని ఆరోపించారు. "మనం అధికారంలో ఉన్నప్పుడే కేంద్ర ప్రభుత్వం ఏమీ చేయలేదు. కాంగ్రెస్ ఉంటే చేస్తుందా? వాళ్లకూ చేయదు. శుక్రవారం తెలంగాణ భవన్‌కు వస్తా. బడ్జెట్ సమావేశాల్లో పాల్గొంటా" అని కేసీఆర్ తెలిపారు. కాగా, బడ్జెట్ సమావేశాల్లో ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు అనుసరించాల్సిన తీరుపై అంశాల వారీగా చర్చించారు. కేటీఆర్, పోచారం, హరీశ్‌రావు, తలసాని, ప్రశాంత్‌రెడ్డి, మల్లారెడ్డి, జగదీశ్‌రెడ్డి పాల్గొన్నారు.

ఎమ్మెల్యేగా ప్రమాణం

గజ్వేల్ ఎమ్మెల్యేగా కేసీఆర్ గురువారం ప్రమాణ స్వీకారం చేశారు. శాసనసభ స్పీకర్ గడ్డ ప్రసాద్ తన



చాంబర్‌లో మధ్యాహ్నం 12.45 గంటలకు ఆయనతో ప్రమాణం చేయించారు. ఈ కార్యక్రమంలో శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి, పోచారం, బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ముఖ్య నేతలు పాల్గొన్నారు. అనంతరం అసెంబ్లీ ఆవరణలోని ప్రతిపక్ష నేత చాంబర్‌లో కేసీఆర్ ప్రత్యేక పూజలు చేసి బీఆర్ఎస్ శాసనసభాపక్ష నేతగా బాధ్యతలు చేపట్టారు. కాగా, ఈ కార్యక్రమాలకు బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు కొత్త ప్రభాకర్‌రెడ్డి, చింతా ప్రభాకర్, కాలె యాదయ్య, పద్మారావుగౌడ్ హాజరు కాలేదని సమాచారం.

రేవంత్ నేను పాత మిత్రులం!

త్వరలోనే రేవంత్‌ను కలుస్తా: మల్లారెడ్డి

హైదరాబాద్, ఫిబ్రవరి 1(ఆంధ్రజ్యోతి): "నేను రేవంత్‌రెడ్డి పాత మిత్రులం. టీడీపీలో కలిసి పనిచేశాం. ఇప్పుడు ఆయన రాష్ట్ర సీఎం. ఆయనను కలిస్తే తప్పేంటి" అని మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే మల్లారెడ్డి అన్నారు. రేవంత్‌ను త్వరలోనే కలుస్తానని చెప్పారు. కీసర ఆలయంలో నిర్వహించబోయే పూజా కార్యక్రమాలకు ఆహ్వానిస్తానని తెలిపారు. గురువారం అసెంబ్లీ ప్రాంగణంలో మల్లారెడ్డి మీడియాతో మాట్లాడారు. మల్కాజిగిరి ఎంపీ స్థానంలో పోటీ చేయాలని బీఆర్ఎస్ అధిష్ఠానం తనను కోరుతోందని చెప్పారు. అయితే, తన కుమారునికి అవకాశం కల్పించాలని అధిష్ఠానానికి విజ్ఞప్తి చేశానన్నారు. వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో తాను పోటీ చేయబోనని చెప్పారు. అయితే, "రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి రావడం ఆ పార్టీ వాళ్లకు షాక్.. అధికారం కోల్పోవడం మాకు షాక్" అని మల్లారెడ్డి వ్యాఖ్యానించారు. కాగా, హైదరాబాద్‌లో రియల్ ఎస్టేట్ వ్యాపారం నెమ్మదించిందన్న మల్లారెడ్డి.. త్వరలో గోవాలో రియల్ వ్యాపారం చేస్తానని చెప్పారు. ఇప్పటికే గోవాలో ఓ హోటల్ కొన్నట్లు తెలిపారు.

పాత.. కొత్త స్పీకర్ల కలయిక!



బాన్సువాడ టౌన్, ఫిబ్రవరి 1: ప్రత్యేక తెలంగాణ ఏర్పడ్డాక రాష్ట్రంలో అసెంబ్లీ స్పీకర్లుగా పనిచేసిన, చేస్తున్న ముగ్గురు ఒకచోట కలిశారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం తరపున అసెంబ్లీ స్పీకర్‌గా 2014-19 వరకు మధుసూదనా చారి, 2019-23 వరకు పోచారం శ్రీనివాస్‌రెడ్డి కొనసాగారు. ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం తరపున 2023 డిసెంబరు నుంచి గడ్డం ప్రసాద్.. స్పీకర్‌గా కొనసాగుతున్నారు. గురువారం హైదరాబాద్‌లో ఎమ్మెల్యేగా కేసీఆర్ ప్రమాణ స్వీకారం సందర్భంగా వారు ముగ్గురు కలిశారు. ఈ సందర్భంగా ముగ్గురూ కలిసి ఫొటో దిగారు.

టచ్‌లో బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు.. హైకమాండ్ వద్దనడంతో ఆగాం

» ప్రభుత్వ సలహాదారుడు షబ్బీర్ అలీ

కామారెడ్డి, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): "బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు చాలా మంది కాంగ్రెస్‌తో టచ్‌లో ఉన్నారు. ఇటీవల ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని పలువురు ఎమ్మెల్యేలు కలవడమే ఇందుకు నిదర్శనం. వారంతా కాంగ్రెస్‌లో చేరే అవకాశాలున్నాయి. అయితే.. హైకమాండ్ ఇప్పుడప్పుడే పార్టీ ఫిరాయింపులు వద్దని చెప్పింది. అందుకే.. ఫిరాయింపులను ప్రోత్సహించడంలేదు" అని రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ వ్యాఖ్యానించారు. గురువారం ఆయన కామారెడ్డిలో జరిగిన ఉచిత వైద్య శిబిరంలో పాల్గొని ప్రసంగించారు. రానున్న లోక్‌సభ ఎన్నికల్లో బీఆర్ఎస్ ఒక్క సీటు కూడా గెలవదన్నారు. కేటీఆర్ అహంకారపూరితంగా మాట్లాడుతున్నారంటూ షబ్బీర్ అలీ మండిపడ్డారు. "రాష్ట్ర ప్రజలు బీఆర్ఎస్‌ను ఛీ కొట్టినప్పటికీ కేటీఆర్ అహంకారం తగ్గడంలేదు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి రెండు నెలలు కాకముందే సర్కారును కూల్చేస్తామని, త్వరలోనే ప్రభుత్వం పడిపోతుందంటూ కేటీఆర్ అహంకారపూరిత మాటలు మాట్లాడుతున్నారు. ప్రభుత్వాన్ని ఎలా కూలుస్తారో చూస్తాం" అని సవాల్ విసిరారు. పదేళ్లుగా రాష్ట్రాన్ని బీఆర్ఎస్ లూటీ చేసిందని ఆరోపించారు. ఓ అధికారి వద్దే రూ.100 కోట్ల అవినీతి సొమ్ము బయటపడడం బీఆర్ఎస్ పాలనకు నిదర్శనమని ఆయన విమర్శించారు.

ఎంపీ టికెట్ ఆశావహులతో గాంధీభవన్‌లో సందడి

కాంగ్రెస్ టికెట్ కోసం 41 మంది దరఖాస్తులు

హైదరాబాద్, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ నుంచి లోక్‌సభ ఎన్నికల్లో పోటీ చేసేందుకు దరఖాస్తులు సమర్పించడానికి వచ్చిన ఆశావహులు, వారి అనుచరులతో గాంధీభవన్‌లో గురువారం సందడి నెలకొంది. పార్టీ తరఫున తమకు టికెట్ కేటాయించాలని కోరుతూ 41 మంది అభ్యర్థులు దరఖాస్తులు ఇచ్చారు. బుధవారం ఏడుగురు దరఖాస్తు చేసుకోగా గురువారం 34 మంది పార్టీ అభ్యర్థిత్వాన్ని ఆశిస్తూ దరఖాస్తులను సమర్పించారు. ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క సతీమణి ఖమ్మం పార్లమెంట్ స్థానానికి దరఖాస్తు చేశారు. అదే నియోజకవర్గం నుంచి తనకు అవకాశం కల్పించాలని పార్టీ సీనియర్ నేత వి.హన్మంతరావు దరఖాస్తు సమర్పించారు. భువనగిరి నుంచి చామల కిరణ్ కుమార్ రెడ్డి, నిజామాబాద్ నుంచి ఆకుల లలిత తదితరులు లోక్‌సభ బరిలో నిలిచేందుకు తమకు అవకాశం కల్పించాలని దరఖాస్తులు అందజేశారు. నియోజకవర్గాల వారిగా.. మహబూబ్‌బాద్ 9, నాగర్‌కర్నూల్ 8, వరంగల్ 6, భువనగిరి 6, ఖమ్మం 2, నిజామాబాద్ 3 చొప్పున దరఖాస్తులు అందినట్టు గాంధీభవన్ వర్గాలు పేర్కొన్నాయి.

బడ్జెట్‌లో అందమైన అబద్ధాలు చెప్పారు

» సీపీఐ జాతీయ కార్యదర్శి నారాయణ

హైదరాబాద్, ఫిబ్రవరి1(ఆంధ్రజ్యోతి): కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ మధ్యంతర బడ్జెట్‌లో అందమైన భాషతో అందమైన అబద్ధాలు చెప్పారని సీపీఐ జాతీయ కార్యదర్శి కె. నారాయణ విమర్శించారు. బడ్జెట్‌లో ఉద్యోగాల ఊసే లేదని, కార్పొరేట్ రంగానికి పెద్దపీట వేశారన్నారు. కేంద్ర బడ్జెట్‌లో తెలంగాణకు మొండిచేయి చూపారని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు విమర్శించారు. బయ్యారం ఉక్కు పరిశ్రమ ఊసే లేదని, పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్టుకు నిధులు ప్రకటించలేదన్నారు. విద్యా రంగానికి 10శాతం నిధులు కేటాయించాల్సి ఉన్నా విస్మరించారని ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు కసిరెడ్డి మణికంఠ రెడ్డి, పుట్ట లక్ష్మణ్ అన్నారు. వ్యవసాయాన్ని కార్పొరేట్ కంపెనీలకు ధారాదత్తం చేసేలా బడ్జెట్ ఉందని తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం ప్రధాన కార్యదర్శి పశ్య పద్మ విమర్శించారు.

ఇది భ్రమల బడ్జెట్: తమ్మినేని

కేంద్ర బడ్జెట్‌ను కార్పొరేట్లకు లాభాలు కట్టబెట్టే, ప్రజలను భ్రమల్లో పెట్టే బడ్జెట్ అని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం విమర్శించారు. లోక్‌సభ ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని ప్రకటించిన బడ్జెట్ ఇది అని పేర్కొన్నారు.

జనాభా వృద్ధి రేటు సవాళ్లపై కమిటీ

» ఉన్నతాధికారులతో ఏర్పాటు చేయనున్న కేంద్రం
» సంతానోత్పత్తి రేటు తగ్గుతోందంటూ నివేదికలు
» తగినంతగా రీ ప్లేస్‌మెంట్ లేదనే ఆందోళనలు..

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 1: దేశంలో జనాభా వృద్ధి రేటులో ఎదురవుతున్న సవాళ్లపై ఉన్నత స్థాయి కమిటీని ఏర్పాటు చేయనున్నట్లు ఆర్థిక మంత్రి నిర్మల తెలిపారు. సంతానోత్పత్తి రేటు భర్తీ స్థాయుల (రీప్లేస్‌మెంట్ రేట్) కంటే పడిపోయినట్లు గణాంకాలు సూచిస్తుండడంతో ఈ నిర్ణయం తీసుకున్నారు. దేశంలో 2011లో చివరిసారిగా జనాభా లెక్కల సేకరణ చేపట్టారు. 2021లో మళ్లీ గణన నిర్వహించాల్సి ఉన్నప్పటికీ కొవిడ్ నేపథ్యంలో వాయిదా వేశారు. ఈ క్రమంలో జనాభాపై సాధికార లెక్కలు లేవు. వృద్ధి రేటు 2.1 నుంచి 2కి తగ్గిందంటూ 2020 నాటి శాంపిల్ రిజిస్ట్రేషన్ సిస్టమ్ (ఎస్ఆర్ఎస్), 2.2 నుంచి 2కు పడిపోయిందంటూ నేషనల్ ఫ్యామిలీ హెల్త్ సర్వే (ఎన్ఎఫ్‌హెచ్ఎస్) పేర్కొన్నాయి. దీనికి పరిష్కార మార్గాలను కమిటీ సూచించనుంది. జనాభా వేగవంతమైన వృద్ధి, మార్పుల నుంచి ఉత్పన్నమయ్యే సవాళ్లను పరిశీలించనుంది.

గోదావరి ఎక్స్‌ప్రెస్‌కు యాభై ఏళ్లు

» భాగ్యనగరం నుంచి వాల్తేరుకు మొదటి రైలు ఇదే
» 1974 ఫిబ్రవరి 1న ప్రారంభమైన ఎక్స్‌ప్రెస్



సికింద్రాబాద్/హైదరాబాద్ సిటీ, విశాఖపట్నం, రాజమహేంద్రవరం, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): గోదావరి ఎక్స్‌ప్రెస్.. ఏపీలోని ఉభయ గోదావరి జిల్లాలతోపాటు ఉత్తరాంధ్ర జిల్లాలకు చెందిన రైలు ప్రయాణికులకు అత్యంత ప్రతిష్ఠాత్మకమైన రైలు. గోదావరి ఎక్స్‌ప్రెస్‌లో బెర్తు దొరికిందంటే.. బంగారం బిస్కెట్ దొరికినంతగా విశాఖ ప్రాంతవాసులు ఆనందపడతారంటే అతిశయోక్తికాదు. 1974 ఫిబ్రవరి 1న హైదరాబాద్-విశాఖపట్నం మధ్య ప్రారంభమైన మొట్టమొదటి రైలు ఇది. అంటే ఈ రైలు ప్రవేశపెట్టి గురువారానికి సరిగ్గా యాభై ఏళ్లు పూర్తయ్యాయి. గోదావరి ఎక్స్‌ప్రెస్ రైలు ప్రస్తుతం హైదరాబాద్(నాంపల్లి) స్టేషన్ నుంచి సాయంత్రం 5.05గంటలకు బయల్దేరి సికింద్రాబాద్, విజయవాడ, ఏలూరు, రాజమండ్రి, సామర్లకోట, అనకాపల్లి మీదుగా.. విశాఖపట్నానికి చేరుకుంటుంది. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ఉద్దండులైన ప్రజాప్రతినిధులకు, ఉన్నతాధికారులకు ఇది ఎంతో ముఖ్యమైన రైలుగా ఉండేది. రాష్ట్ర రాజధాని హైదరాబాద్‌కు రావాలన్నా, ఇక్కడ్నుంచి స్వస్థలాలకు వెళ్లాలన్నా ఈ రైలులో వెళ్లడాన్ని సౌకర్యవంతంగా భావిస్తారు. రాష్ట్రం విడిపోయిన తర్వాత ప్రజాప్రతినిధులు, అధికారుల తాకిడి కొంత తగ్గినా.. సాధారణ ప్రయాణికుల నుంచి ఆదరణ ఏమాత్రం తగ్గలేదు. దక్షిణ మధ్యరైల్వే ఆధ్వర్యంలో నడుస్తున్న గోదావరి ఎక్స్‌ప్రెస్ రైలు మొత్తం 18స్టేషన్లలో ఆగుతుంది. 24 బోగీలతో అతిపొడవైన రైలుగా పేరుగాంచిన ఈ ఎక్స్‌ప్రెస్ 710 కిలోమీటర్ల దూరం ప్రయాణిస్తుంది. గురువారం సాయంత్రం గోదావరి ఎక్స్‌ప్రెస్‌కు రైల్ ఫ్యాన్స్ అసోసియేషన్ ప్రతినిధులు నాంపల్లి స్టేషన్‌లో ఘనంగా పుట్టిన రోజు వేడుకలు నిర్వహించడం విశేషం. దక్షిణ మధ్య రైల్వే కూడా ఈ ఎక్స్‌ప్రెస్‌ను సర్వాంగ సుందరంగా అలంకరించింది. ఈ రైలు ఆగే అన్ని స్టేషన్లలో వేడుకలు జరిపారు. 1990లోనే 24 కోచ్‌లతో అతి పెద్ద రైలుగా పేరొందిన గోదావరి ఎక్స్‌ప్రెస్‌లో 2000 సంవత్సరం నుంచి ఫస్ట్‌క్లాస్ ఏసీ సేవలు అందుబాటులోకి వచ్చాయి. 1993 నుంచే థర్డ్ ఏసీ కోచ్‌లున్న ఈ రైలు.. దక్షిణ మధ్య రైల్వేలోనే మొదటి ఏసీ కోచ్ ఉన్న ఎక్స్‌ప్రెస్‌గా పేరుగాంచింది. ఈ ఎక్స్‌ప్రెస్‌ను నేరుగా దక్షిణమధ్య రైల్వే జనరల్ మేనేజర్ పర్యవేక్షిస్తారంటే దానికి ఉన్న ప్రాముఖ్యత చెప్పనక్కర్లేదు. రైలు నిర్వహణ నుంచి సమయపాలన, పరిశుభ్రత, ఆహార నాణ్యత, ఫిర్యాదులు, ఇతర ఆపరేషన్స్ అన్నీ ప్రతిరోజూ జీఎం టేబుల్ మీద ఉండాల్సిందేనని చెబుతుంటారు.

74 టీఎంసీలు కేటాయించాలి!

గోదావరి-కావేరి అనుసంధానంపై కేంద్రాన్ని డిమాండ్ చేసిన తెలంగాణ

హైదరాబాద్, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): గోదావరి-కావేరి అనుసంధానంలో తరలించే 148 టీఎంసీల జలాల్లో 74 టీఎంసీలను తమకు కేటాయించాలని తెలంగాణ కోరింది. నదుల అనుసంధానంలో తెలంగాణకు 45 టీఎంసీలు కేటాయించాలని ప్రతిపాదించారని, అవి సరిపోవని తెలిపింది. పూర్వ నల్లగొండ, రంగారెడ్డి, మహబూబ్‌నగర్ జిల్లాల్లో పలు ప్రాంతాలకు సాగునీటిని అందించాల్సి ఉన్నందున, 74 టీఎంసీలు ఇవ్వాలని విజ్ఞప్తి చేసింది. గోదావరి-కావేరి అనుసంధానంపైతెలంగాణ లేవనెత్తిన అంశాలపై చర్చించడానికి వీలుగా గురువారం జలసౌధలో జాతీయ నీటి అభివృద్ధి సంస్థ (ఎన్‌డబ్ల్యూడీఏ) హైదరాబాద్ విభాగం చీఫ్ ఇంజనీర్ దేవేందర్ అధ్యక్షతన సమావేశం జరిగింది. దీనికి తెలంగాణ నుంచి ఈఎన్‌సీ బి.నాగేంద్రరావు, అంతరాష్ట్ర విభాగం చీఫ్ ఇంజనీర్ మోహన్‌కుమార్ తదితరులు హాజరయ్యారు. గోదావరి-కావేరి అనుసంధానంతో వివిధ అంశాలపై రాష్ట్ర అధికారులు తమ అభిప్రాయాలను వెలిబుచ్చారు. కాగా తెలంగాణ అభ్యంతరాలపై మళ్లీ సమావేశం ఉంటుందని ఎన్‌డబ్ల్యూడీఏ స్పష్టం చేసింది. అనుమానాలన్నీ నివృత్తి చేశాకే నదుల అనుసంధానంలో ముందుకెళతామని తెలిపింది.

నేటి నుంచి పంచాయతీల్లో 'ప్రత్యేక' పాలన

హైదరాబాద్, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): గ్రామ సర్పంచుల పదవీకాలం ముగిసిన నేపథ్యంలో శుక్రవారం నుంచి పంచాయతీలకు ప్రత్యేక అధికారులు బాధ్యత వహించనున్నారు. ఈ మేరకు గ్రామ ప్రత్యేకాధికారుల నియామకం, బాధ్యతల స్వీకరణ, విధి విధానాలను సూచిస్తూ.. రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ ప్రధాన కార్యదర్శి సందీప్‌కుమార్ సుల్తానియా ఉత్తర్వులు జారీ చేశారు. ఎంపీడీఓ, తహశీల్దారు, ఎంపీఓ, డీటీ, ఆర్ఐ, ఇంజినీర్లు, ఎంఈవోలు, ఇతర గెజిటెడ్ స్థాయి అధికారులను గ్రామ ప్రత్యేక అధికారులుగా నియమించారు. స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణకు కాంగ్రెస్ ప్రభుత్వం సిద్ధంగా లేకపోవడంతో పదేళ్ల తర్వాత మళ్లీ గ్రామాల్లో ప్రత్యేక పాలన ప్రారంభం కానుంది. రాష్ట్రంలోని 12,769 గ్రామ పంచాయతీలకు ప్రభుత్వం ప్రత్యేక అధికారులను నియమించడంతో గురువారం సర్పంచుల వద్ద ఉన్న డిజిటల్ కీలు, చెక్కులు, ఇతర రికార్డులన్నీ సీజ్ చేయాలని గ్రామ పంచాయతీ కార్యదర్శులకు ఆదేశాలు జారీ చేశారు.

నేడు ఈజీఎస్ ఉద్యోగులకు పే స్కేల్ ప్రకటన..?

హైదరాబాద్, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): 'గత ప్రభుత్వం పే స్కేల్ ప్రకటిస్తామని హామీ ఇచ్చింది.. అది అమలుకు నోచుకోలేదు.. కొత్త ప్రభుత్వం మా ఆశలు నెరవేరుస్తుందని జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద పనిచేస్తున్న ఉద్యోగులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. తమకు ఇచ్చిన హామీ మేరకు సీఎం రేవంత్‌రెడ్డి నేడు(శుక్రవారం) ఇంద్రవెల్లి సభలో తమ పే స్కేల్ ప్రకటిస్తారని, సంబురాలు జరుపుకొనేందుకు ముందస్తు ఏర్పాట్లు చేసుకున్నామని ఈజీఎస్ ఉద్యోగులు ఒక ప్రకటనలో తెలిపారు.

కోర్టు ఆదేశాలిచ్చిన గంటల్లోనే జ్ఞానవాపీ సెల్లార్‌లో పూజలు

» హైకోర్టులో అప్పీలు చేసిన మసీదు కమిటీ

వారాణసి, ఫిబ్రవరి 1: జ్ఞాన్‌వాపీ మసీదు సెల్లార్‌లోని 'వ్యాస్ కీ టెఖానా'లో ఉన్న హిందూ దేవత విగ్రహాలకు పూజలు చేసుకోవచ్చంటూ జిల్లా కోర్టు ఆదేశాలు ఇచ్చిన కొద్ది గంటల్లోనే అక్కడ ప్రార్థనలు ప్రారంభమయ్యాయి. బుధవారం రాత్రి 10.30 గంటల సమయంలో పూజలు చేసి లక్ష్మీదేవి, వినాయకులకు హారతి ఇచ్చారు. 31 సంవత్సరాల అనంతరం వ్యాస్‌జీ కా టెఖానాను పూజల కోసం తెరిచారని కాశీ విశ్వనాథ మందిర ట్రస్టు అధ్యక్షుడు నాగేంద్ర పాండే తెలిపారు. కాగా, తమకు అప్పీలు వంటి న్యాయ ప్రక్రియకు కూడా అవకాశం ఇవ్వకుండా హిందువులు పూజలు చేసుకోవడానికి అనుమతి ఇవ్వడం తగదని పేర్కొంటూ మసీదు కమిటీ గురువారం సుప్రీంకోర్టును ఆశ్రయించింది. అయితే తొలుత హైకోర్టులో పిటిషన్ వేయాలని ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డి.వై.చంద్రచూడ్ చెప్పడంతో దాన్ని అమలు చేసింది. అలహాబాద్ హైకోర్టులో పిటిషన్ సమర్పించి అత్యవసరంగా విచారణ జరపాలని కోరింది.

హేమంత్ సోరెన్‌కు ఒక రోజు కస్టడీ

» 10 రోజుల పాటు ఇవ్వాలన్న ఈడీ వినతిపై నేడు తీర్పు
» రాంచీలో 8.5 ఎకరాలు ఆక్రమించినట్టు కేసు నమోదు

రాంచీ, ఫిబ్రవరి 1: మనీలాండరింగ్ కేసులో అరెస్టయిన ఝార్ఖండ్ మాజీ ముఖ్యమంత్రి హేమంత్ సోరెన్‌ను గురువారం ఇక్కడి పీఎంఎల్ఏ ప్రత్యేక కోర్టు ఒక రోజు జ్యుడీషియల్ కస్టడీకి పంపించింది. పోలీసులు ఆయనను ఇక్కడి బీర్సా ముండా సెంట్రల్ జైలుకు తరలించారు. ఆయనను పది రోజుల పాటు కస్టడీకి ఇవ్వాలన్న వినతిపై కోర్టు శుక్రవారం తీర్పు వెలువరించనుంది. ఈడీ బుధవారం ఆయనను ఏడు గంటల పాటు విచారించింది. అనంతరం ఆయన ముఖ్యమంత్రి పదవికి రాజీనామా చేయగా రాత్రి పది గంటల సమయంలో గవర్నర్ హౌస్ వద్ద అరెస్టు చేసింది. కాగా, రాత్రి సమయంలో గవర్నర్ హౌస్ ఆవరణలోనే అరెస్టు చేయడాన్ని సవాలు చేస్తూ గురువారం సోరెన్ లాయర్లు సుప్రీంకోర్టును ఆశ్రయించారు. విచారణ సమయంలో ఆయన ధరించిన మతమపరమైన లాకెట్, రింగ్‌లను తీసివేయాలని ఈడీ అధికారులు కోరగా అందుకు ఆయన నిరాకరించారు. రాంచీలో సోరెన్ 12 చోట్ల 8.5 ఎకరాల విస్తీర్ణంగల స్థలాలను అక్రమంగా కలిగి ఉన్నారంటూ ఈడీ కేసుపెట్టింది. ఈ వ్యవహారంలో నగదు అక్రమ నగదు చలామణి జరిగినట్టు ఆరోపించింది. తొలుత భూమి రికార్డుల నకిలీ పత్రాలను తయారు చేస్తున్నారంటూ రెవెన్యూ శాఖ సబ్ ఇన్‌స్పెక్టర్ భాను ప్రతాప్ ప్రసాద్‌పై కేసు నమోదయింది. ఆయన వద్ద 11 ట్రంకు పెట్టెల్లో ఒరిజినల్, నకిలీ దస్తావేజులు, 17 ఒరిజినల్ రిజిస్టర్లు లభించాయి. దీనిపై జరిగిన విచారణలో ఇందులో సోరెన్‌కు సంబంధం ఉందంటూ ప్రసాద్ ఫోన్‌లో లభించిన సమాచారం ఆధారంగా ఈడీ కేసు నమోదు చేసింది. వాంగ్మూలం నమోదు చేయడానికని పిలిచి ఎలా అరెస్టు చేస్తారని సోరెన్ తరపున హాజరైన అడ్వకేట్ జనరల్ రాజీవ్ రంజన్ ప్రశ్నించారు. ఇది ప్రభుత్వాన్ని కూలగొట్టడానికి జరిగిన కుట్ర అని ఆరోపించారు.


జేఎంఎం కూటమి ఎమ్మెల్యేలను తరలించడానికి బేగంపేట విమానాశ్రయం వద్ద సిద్ధంగా ఉన్న బస్సులు

ముఖ్యమంత్రిగా ప్రమాణం చేయండి

(మొదటి పేజీ తరువాయి)

చంపయి సోరెన్ గవర్నర్ రాధాకృష్ణన్‌ను కలిశారు. హేమంత్ సోరెన్ రాజీనామా చేసిన అనంతరం రాష్ట్రానికి కొత్త సీఎం లేకపోవడంతో గందరగోళ పరిస్థితులు నెలకొని ఉన్నాయని తెలిపారు. ముఖ్యమంత్రి లేకపోవడంతో రాజకీయ సంక్షోభం ముదిరిపోయే ప్రమాదం ఉందన్నారు. ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తామన్న తమ విజ్ఞప్తిని అంగీకరించాలని కోరారు. కాగా, చంపయి సోరెన్‌ను ప్రభుత్వ ఏర్పాటుకు ఆహ్వానించడంలో గవర్నర్ ఆలస్యం చేయడంతో.. జేఎంఎం-కాంగ్రెస్ కూటమి ఎమ్మెల్యేలను హైదరాబాద్ తరలించేందుకు ఏర్పాట్లు చేశారు. గురువారం రెండు చార్టర్డ్ విమానాలను సిద్ధం చేయగా.. సాయంత్రం 6.30 గంటల సమయంలో పొగమంచు ఎక్కువగా ఉండడంతో వాటిని రద్దు చేశారు. 81 మంది సభ్యులున్న ఝార్ఖండ్ అసెంబ్లీలో జేఎంఎం కూటమికి 43 మంది ఎమ్మెల్యేలు ఉన్నారు. ఇక మనీలాండరింగ్ కేసులో ఈడీ తనను అరెస్టు చేయడాన్ని సవాలు చేస్తూ మాజీ సీఎం హేమంత్ సోరెన్ సుప్రీంకోర్టును ఆశ్రయించారు. ఆయన పిటిషన్‌ను విచారించేందుకు సీజేఐ ముగ్గురు న్యాయమూర్తులతో ప్రత్యేక ధర్మాసనాన్ని ఏర్పాటు చేశారు. సోరెన్ పిటిషన్‌పై శుక్రవారం విచారణ జరపనున్నారు.

సమస్యలు పరిష్కరించాలని డిప్యూటీ సీఎం భట్టికి వినతి

ముదిగొండ, ఫిబ్రవరి 1: ముదిగొండ మండలం వనంవారికృష్ణాపురం గ్రామస్థులు హైదరాబాద్‌లోని ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్కను గురువారం కలిశారు. గ్రామంలోని సమస్యలను భట్టి విక్రమార్క దృష్టికి తీసుకువెళ్లారు. సమస్యల పరిష్కారానికి కృషిచేస్తానని భట్టి గ్రామస్థులకు హామీ ఇచ్చారు. గ్రామస్థులు మల్లెల అజయ్, తిరపయ్య, శ్రీను, సమ్మయ్య, వీరభద్రం, పుల్లయ్య పాల్గొన్నారు.


భట్టి విక్రమార్కను కలిసిన గ్రామస్థులు

'పది' ఫలితాలపై ప్రత్యేక దృష్టిసారించాలి

- అదనపు కలెక్టర్ సత్యప్రసాద్
- విద్యాశాఖ అధికారులతో సమీక్ష
- ఆశ్రమ పాఠశాలలను తనిఖీ చేసిన డీడీ విజయలక్ష్మి

ఖమ్మం కలెక్టరేట్ ఫిబ్రవరి 1: పదోతరగతి ఫలితాలపై ప్రత్యేక దృష్టి సారించి నూరు శాతం ఉత్తీర్ణత సాధనకు హెచ్‌ఎంలు, ఎంఈవోలు బాధ్యతాయుతంగా కృషిచేయాలని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ బి.సత్యప్రసాద్ అన్నారు. గురువారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో డీఈవో సోమశేఖరశర్మ, మండల విద్యాధికారులు, పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులతో పదవతరగతి పరీక్షలపై అదనపు కలెక్టర్ సమీక్షించారు. ఆయన మాట్లాడుతూ పదవతరగతి పరీక్షలు సమీపిస్తున్న దృష్ట్యా విద్యార్థులను పరీక్షలకు సన్నద్ధం చేయాలన్నారు. విద్యార్థులకు ప్రత్యేక శిక్షణ తరగతులు నిర్వహణతో పాటు ఏ ఏ పాఠ్యాంశంలో వెనుకబడిన విద్యార్థులను గుర్తించి ఆయ సబ్జెక్టుల ఉపాధ్యాయులతో ప్రత్యేక శిక్షణనిచ్చే విధంగా చూడాలన్నారు. విద్యార్థుల్లో పరీక్షలపై ఉన్న భయాన్ని తొలగించాలని వారితో ఉపాధ్యాయులు విద్యార్థులకు సబ్జెక్టులో అర్థం కాని విషయాన్ని గమనించి వారి సందేహాలను నివృత్తి చేసి ప్రోత్సహించాలన్నారు. నూరు శాతం ఉత్తీర్ణతకు ఉపాధ్యాయులు, ప్రధానోపాధ్యాయులు చొరవ చూపాలన్నారు.


ఆశ్రమ పాఠశాల విద్యార్థుల సామర్థ్యాలు పరీక్షిస్తున్న డీడీ

'పది'లో నూరుశాతం ఫలితాలు సాధించేలా కృషిచేయండి

కారేపల్లి: పదో తరగతి పరీక్షలలో నూరుశాతం ఫలితాలు సాధించేదకు ఉపాధ్యాయులు కృషిచేయాలని జిల్లా గిరిజన డిప్యూటీ డైరెక్టర్ ఎన్.విజయలక్ష్మి అన్నారు. గురువారం కారేపల్లి మండలంలోని ఉసిరికాయలపల్లి ఆశ్రమ పాఠశాలను ఆమె సందర్శించారు. పాఠశాలల్లోని తరగతి గదులను పరిశీలించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ నూటికి నూరుశాతం ఉత్తమ ఫలితాలు సాధించేలా ఉపాధ్యాయులు కృషిచేయాలని కోరారు. ఈకార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం నామ నాయక్, ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

టేకులతండ గిరిజన పాఠశాల తనిఖీ

కామేపల్లి: కామేపల్లి మండల పరిధిలోని టేకులతండ గిరిజ పాటశాల మౌలిక వసతులు, విద్యా బుద్దులు నేర్పడంతో అద్భుతంగా ఉందని గిరిజన శాఖ డీడీ విజయలక్ష్మి అన్నారు. గురువారం పాఠశాలను ఆకస్మికంగా సందర్శించారు. ఇటీవల మన ఊరు మన బడితో పాటశాలను తీర్చిదిద్దారు. పాఠశాల పరిసరాలను, రిజిస్టర్లు, విద్యార్థుల తరగతి గదులను పరిశీలించారు. తెలుగు, గణితం, పరిసరాల విజ్ఞానం, ఇంగ్లీష్, జీకే వంటి అంశాలపై విద్యార్థులను పలు ప్రశ్నలను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థుల ప్రతిభను అభినందించారు.


సమీక్ష నిర్వహిస్తున్న అదనపు కలెక్టర్ సత్యప్రసాద్

ఈ పరిశీలనలో ఉసిరికాయలపల్లి ఏహెచ్ఎస్ హెచ్‌ఎం బి. నామ, ఉపాధ్యాయులు సపావట్ కిషన్, భారతి, ప్రమీల, దేవి పాల్గొన్నారు. అనంతరం కామేపల్లి మండల కేంద్రంలోని గిరిజన ఆశ్రమ పాఠశాలను పరిశీలించారు. విద్యార్థినులతో మాట్లాడారు. ఈ పరిశీలనలో వార్డెన్ వసంత, ఉపాధ్యాయురాలు పద్మ పాల్గొన్నారు.

విద్యార్థులకు అల్పాహారం

సత్తుపల్లిరూరల్: దాతల సహకారంతో పదవ తరగతి విద్యార్థులకు సాయంత్రం ఉచితంగా అల్పాహారం ఏర్పాటు చేసినట్లు సదాశివునిపేట జడ్పీఎస్ఎస్ హెచ్‌ఎం మట్టా అజయ్‌కుమార్ తెలిపారు. గురువారం పాఠశాలలో ఈ కార్యక్రమాన్ని గ్రామస్థులు తుంబూరు సరస్వతి దామోదర్‌రెడ్డి, ఆళ్ల రమేష్, చీకటి సత్యనారాయణ, కాల్నేని వెంకటేశ్వరరావు, పాఠశాల ఉపాధ్యాయుల సహకారంతో ఏర్పాటు చేశామన్నారు. ఈ అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకుని పది ఫలితాలను ఉత్తమంగా సాధించాలని ఆకాంక్షించారు.

బీమాతో కుటుంబాల భవిష్యత్‌కు ధీమా

సత్తుపల్లిరూరల్, ఫిబ్రవరి1: బ్యాంక్ ఖాతా కలిగివున్న ప్రతిఒక్కరూ కొద్దిపాటి బీమా చెల్లించినట్లయితే వారి వారి కుటుంబాల భవిష్యత్‌కు ధీమా కలుగుతుందని ఎస్‌బీఐ (ఏసీబీ) సత్తుపల్లి మేనేజర్ భైరి వేణు అన్నారు. సత్తుపల్లి మండలంలోని రెండు కుటుంబాలకు మంజూరైన రూ.30లక్షల విలువైన రెండు చెక్కులను బాధిత కుటుంబాలకు ఆయన గురువారం అందజేశారు. ప్రమాద బీమా కింద రూ.1000బీమాగా చెల్లించిన రేజర్లకు చెందిన చాపల వెంకన్న గతేడాది రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన నామినీకి రూ.20లక్షలు, రూ.500తో బీమా కట్టిన తుంబూరుకు చెందిన వేల్పుల ప్రసాద్ ఇటీవల పాముకాటుతో మృతిచెందగా ఆయన కుటుంబ సభ్యులకు రూ.10లక్షల చెక్కులను ఆయన అందజేశారు. ఏడాదికి చెల్లించే బీమాతో ఈ ఇన్సూరెన్స్ వర్తిస్తుందని, రూ.436చెల్లిస్తే ఎలా మృతిచెందినా రూ.2లక్షలు, ప్రమాదంలో మృతిచెందినట్లయితే రూ.20బీమాగా చెల్లిస్తే రూ.2లక్షలు ఇన్సూరెన్స్ వస్తుందని చెప్పారు. అదేవిధంగా రూ.1000, రూ.436, రూ.20కలిపి రూ.1456బీమా చెల్లించినట్లయితే రూ.24లక్షల ప్రమాద బీమా, ఇతర కారణాలతో మృతిచెందినట్లయితే రూ.2లక్షల ఇన్సూరెన్ సదరు నామినీకి ఇవ్వనున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో బ్యాంక్ ఉద్యోగులు రాజా, చంద్రమోహన్, జక్కుల కుమారి, చల్లగుండ్ల వాసంతి తదితరులు పాల్గొన్నారు.


బీమా చెక్కు అందిస్తున్న బీఎం వేణు

నృత్యంలో న్యూఇరా విద్యార్థి ప్రతిభ

ఖమ్మం ఖానాపురం హవేలీ, ఫిబ్రవరి 1: భరత్ ఆర్ట్స్ అకాడమి నిర్వహించిన సంక్రాంతి స్వర్ణ నంది పురస్కార కార్యక్రమంలో నగరంలోని న్యూఇరా పాఠశాలలో నాల్గో తరగతి చదివే భవిష్యవర్ధిని అత్యుత్తమ ప్రతిభ కనబరచి ప్రతిభా పురస్కారం అందుకుందని పాఠశాల డైరెక్టర్ డాక్టర్ ఫి భూమేశ్వరరావు తెలిపారు. భవిష్యత్తులో మరిన్ని నృత్యప్రదర్శనల్లో ప్రతిభ కనబరచి అనేక పురస్రారాలు అందుకోవాలని దీవించారు.



విద్యార్థిని అభినందిస్తున్న డైరెక్టర్

పంచాయతీ పాలక వర్గాలకు సన్మానం

తల్లాడ, ఫిబ్రవరి 1: తల్లాడ మండలంలో ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి గురువారం పర్యటించారు. తల్లాడలో గ్రామపంచాయతీ అదనపు భవనాన్ని ఆమె ప్రారంభించారు. పదవీ బాధ్యతలు ముగిసిన తల్లాడ గ్రామపంచాయతీ పాలకవర్గ సభ్యులను సన్మానించారు. అనంతరం లక్ష్మీపురం గ్రామంలో దేవాలయాన్ని సందర్శించి ప్రత్యేక పూజలు చేశారు. గ్రామసెంటర్లోని పార్టీ పతాకాన్ని ఆమె ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఎంపీటీసీలు దగ్గుల రఘుపతిరెడ్డి, వేమిరెడ్డి రామతులిశమ్మ, సొసైటీ చైర్మన్ దిరిశాల నర్సింహారావు, ఎంపీడీవో కొండపల్లి శ్రీదేవి, ఎస్‌ఐ బి.కొండల్‌రావు, మండల కాంగ్రెస్ నాయకులు కాపా సుధాకర్, వేమిరెడ్డి కృష్ణారెడ్డి, దుండేటి వీరారెడ్డి, వడ్డే రామారావు, గణేశుల రవి, నాగిరెడ్డి, తాళ్ల జోసఫ్, రాయల రాము, అనుమోలు కృష్ణ పాల్గొన్నారు.

సర్పంచ్‌కు సన్మానం

కొణిజర్ల: మండల పరిధిలోని పెద్దమునగాల గ్రామ సర్పంచ్ పరికపల్లి శ్రీను పదవికాలం పూర్తికావడంతో గురువారం గ్రామస్థులు కొంతమంది సన్మానించారు. గ్రామాభివృద్ధికి ఆయన చేసిన సేవలను పలువురు కొనియాడారు. శ్రీను మాట్లాడుతూ జీవితాంతం ప్రజల అభిమానాన్ని మరిచిపోనని, తనవంతు శక్తివంచలేకుండ గ్రామాన్ని అభివృద్ధి చేశానని తెలిపారు. ప్రజల సహకారం ఉంటే ఏ అభివృద్ధి అయిన సాధ్యమేనన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి రాము, గ్రామస్తులు పాల్గొన్నారు.


పెద్దమునగాల సర్పంచ్‌ను సన్మానిస్తున్న స్థానికులు

పెనుబల్లి పంచాయతీ పాలకవర్గానికి వీడ్కోలు

పెనుబల్లి: పెనుబల్లి గ్రామపంచాయతీ సర్పంచ్, ఉపసర్పంచ్, వార్డుసభ్యులకు గ్రామస్థుల ఆధ్వర్యంలో గురువారం వీడ్కోలు సభ ఏర్పాటుచేశారు. సర్పంచ్ తావూనాయక్, ఉపసర్పంచ్ పానెం నాగేశ్వరరావుతోపాటు వార్డుసభ్యులను బీఆర్ఎస్ నాయకుడు, మాజీ ఎంపీటీసీ కోటగిరి సుధాకర్‌రావు సత్కరించి వారి సేవలను కొనియాడారు. కార్యక్రమంలో కార్యదర్శి ఎన్‌వీ.ప్రసాదరావు, నాయకులు బొర్రా వెంకటేశ్వర్లు, బండి వెంకటేశ్వర్లు, వేముల రవికుమార్, మల్లెల సతీష్, చీపు వెంకటేశ్వర్లు, నాగప్రసాద్, చీపు శ్రీను, కోటి, గోపి, వేణు, నాగేశ్వరరావు పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు పువ్వాడ పరామర్శ

ఖమ్మంకార్పొరేషన్, ఫిబ్రవరి1: మాజీ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ గురువారం నగరంలో పలువురిని పరామర్శించారు. జిల్లా సబ్‌జైలులో ఉన్న బీఆర్ఎస్ నగర అధ్యక్షుడు పగడాల నాగరాజును జైలుకు వెళ్లి పువ్వాడ కలుసుకున్నారు. అనంతరం నాగరాజు బెయిల్‌పై విడుదల కాగా, ఆయన నివాసానికి వెళ్లారు. తరువాత కనకం జనార్థన్ భార్య శారద ఇటీవల మృతిచెందటంతో త్రీటౌన్‌లోని వారి నివాసానికి వెళ్లి, శారద చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. బీఆర్ఎస్ మహిళానేత కొల్లు పద్మ మామ కొల్లు కృష్ణయ్య, ప్రముఖ న్యాయవాది మల్లాది వాసుదేవ్ తల్లి ప్రభావతి ఇటీవల మృతిచెందటంతో వారి నివాసాలకు వెళ్లి కృష్ణయ్య, ప్రభావతి చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమాల్లో పువ్వాడ వెంట డీసీసీబీ చైర్మన్ కూరాకుల నాగభూషయ్య, కార్పొరేటర్లు కూరాకుల వలరాజు, నాగండ్ల కోటేశ్వరరావు, జ్యోతిరెడ్డి, మాజీ డిప్యూటీ మేయర్ బత్తుల మురళీప్రసాద్, బీఆర్ఎస్ లీగల్‌సెల్ నాయకులు కొత్త వేంకటేశ్వర్లు, బిచ్చాల తిరుమలరావు, బీఆర్ఎస్ నాయకులు చిరుమామిళ్ల, మోరంపుడి సాయి తదితరులున్నారు.


సబ్‌జైలు వద్ద మాజీ మంత్రి పువ్వాడ

పశువైద్యశిబిరానికి విశేష స్పందన

మధిర రూరల్, ఫిబ్రవరి 1: మధిర మండలం సిద్దినేనిగూడెం(మర్లపాడు) గ్రామంలో గురువారం పీవీ.నర్సింహారావు తెలంగాణ పశువైద్యవిద్యాలయం, పశుసంవర్ధకశాఖ ఖమ్మంవారి ఆధ్వర్యంలో నిర్వహించిన పశువైద్యశిబిరానికి విశేష స్పందన లభించింది. ఈ శిబిరాన్ని పశువైద్యశాల కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఉదయ్‌కుమార్ ప్రారంభించారు. శిబిరంలో పలు ఆవులకు మొదటిసారిగా పిండమార్పిడి ప్రక్రియ చేశారు. కార్యక్రమంలో పశుసంవర్ధకశాఖ జిల్లా జాయింట్ డైరెక్టర్ వేణుమనోహర్, ఎంపీపీ లలిత, ఎంపీడీవో సిలార్ సాహెబ్, మాజీ జడ్పీటీసీ సూరంశెట్టి నాగభూషణం, మండల పశువైద్యాధికారి కృష్ణారెడ్డి, జూనియర్ వెటర్నరీ అధికారి లక్ష్మణ్‌రావు, సిబ్బంది రఫీ, అహ్మద్, కొండల్‌రావు, రమేష్, ఉపేందర్ పాల్గొన్నారు.

చేగొమ్మ సొసైటీ స్టాఫ్ అసిస్టెంట్ తొలగింపు

కూసుమంచి, ఫిబ్రవరి 1: మండలంలోని చేగొమ్మ సహకార సంఘంలో పనిచేస్తున్న స్టాఫ్ అసిస్టెంట్ బాలబోయిన రమేష్‌ను తొలగిస్తూ జిల్లా కోపరేటివ్ అధికారి విజయకుమారి ఉత్తర్వులు జారీ చేశారు. సహకారసంఘంలో రమేష్ తాత్కాలిక ఉద్యోగిగా పనిచేస్తున్నాడు. అదేవిధంగా జీళ్లచెరువు గ్రామపంచాయతీలో ఎన్నికల్లో పోటీచేసి వార్డుసభ్యుడిగా కొనసాగుతున్నాడు. ఈక్రమంలో 2019లో అతనిని పర్మినెంట్ చేస్తు ఉత్తర్వులు జారీ చేసింది. అయితే వార్డుసభ్యుడి పదవిని రాజీనామా చేయాల్సి ఉండగా అలాగే కొనసాగుతున్నాడు. దీంతో చేగొమ్మ గ్రామానికి చెందిన కొండపర్తి సురేష్‌తోపాటు మరికొందరు రమేష్‌పై కమిషనర్‌కు ఫిర్యాదుచేశారు. ఇది సహకార సంఘ నిబంధనలకు విరుద్ధమని ఫిర్యాదు చేశారు. ఈక్రమంలో కమిషనర్ సంబంధిత అధికారులతో విచారణ నిర్వహించారు. ఈమేరకు విచారణ నిర్వహించిన అధికారులు రమేష్ సహకార సంఘంలో ఉద్యోగిగా కొనసాగుతున్నారని అదేవిధంగా జీళ్లచెరువు పంచాయతీ వార్డుసభ్యుడిగా పనిచేస్తూ పాలకమండలి సమావేశాల్లో హాజరవుతున్నట్లుగా గుర్తించారు. విచారణ అధికారి నివేదిక ఆధారంగా రమేష్ సర్వీస్ రూల్స్ అతిక్రమించారని అభియోగాలు మోపుతూ రమేష్‌ను విధుల నుంచి తొలగిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. అదేవిధంగా అతను పొందిన వేతనాన్ని రికవరీ చేయాలని ఆదేశించారు. నిబంధనలు ఉల్లంఘించినందకు అతనిపై క్రిమినల్ కేసునమోదు చేయాలని ఆదేశించారు.

పురుగులమందు తాగి వ్యక్తి ఆత్మహత్య

ఖమ్మం క్రైం, ఫిబ్రవరి 1: మద్యానికి బానిసై వ్యక్తి పురుగుమందు తాగి మృతిచెందిన సంఘటన గురువారం ఖమ్మం నగరంలో జరిగింది. త్రీటౌన్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం కూసుమంచి మండలం ఎర్రగడ్డ తండాకు చెందిన భూక్యా నరేష్(30) నగరంలో నివా సం ఉంటూ చికెన్ సెంటర్లో పనిచేస్తున్నాడు. బుధవారం భార్య లేని సమయంలో పురుగుమందు తాగి ఆత్మహత్యయత్నానికి పాల్పడ్డాడు. అనంతరం ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ గురువారం మృతి చెందాడు. ఈ ఘటనపై కుటుంబ సభ్యులు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

రోడ్డు పక్కన నిలిపిఉన్న వాహనం స్టేషన్‌కు తరలింపు

ఖమ్మం క్రైం, ఫిబ్రవరి1: గత వారం రోజులుగా రోడ్డుపక్కన పార్కింగ్ చేసి ఉన్న ద్విచక్ర వాహనాన్ని అర్బన్ పోలీసులు స్టేషన్‌కు తరలించారు. నగర శివారులోని వెలుగుమట్ల సమీపంలోని వైరా మెయిన్‌రోడ్డు పక్కన ఓ ద్విచక్ర వాహనం నిలిపిఉంది. ఈ విషయాన్ని స్థానికులు పోలీసులకు సమాచారం అందించటంతో వారు సంఘటనస్థలం వద్దకు చేరుకొని వాహనాన్ని పరిశీలించి స్టేషన్‌కు తరలించారు.

తలసీమియా పిల్లలకు అండగా ప్రభుత్వం

- రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటి
- సమస్యలు పరిష్కరించాలని మంత్రికి వినతులు


పొంగులేటికి జ్ఞాపికను అందిస్తున్న సంకల్ప స్వచ్ఛంద సంస్థ నిర్వాహకులు

ఖమ్మంసంక్షేమవిభాగం: తలసీమియా బాధిత పిల్లలకు కాంగ్రెస్ ప్రభుత్వం అండగా ఉంటుందని రాష్ట్ర రెవెన్యూ, గృహనిర్మాణం, సమాచారశాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు. గురువారం ఖమ్మంలోని మంత్రి నివాసంలో సంకల్ప స్వచ్ఛంద సంస్థ నిర్వాహకులు ప్రొద్దుటూరు అనిత, పావని, రవిచందర్ ఆధ్వర్యంలో మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డిని సన్మానించి జ్ఞాపికను అందించారు. మంత్రి పొంగులేటి తలసీమియా పిల్లల ఆరోగ్య పరిస్థితిని తెలుసుకున్నారు.

యూనివర్సిటీని ఏర్పాటు చేయాలని మంత్రికి పీడీఎస్‌యూ వినతి

అన్ని రంగాల్లో అభివృద్ధిలో ఉన్న ఖమ్మం జిల్లాలో ప్రభుత్వ జనరల్ యూనివర్సిటీ లేకపోవటంతో ఉన్నత విద్యకు జిల్లా నుంచి విద్యార్థులు సుదూర ప్రాంతాలకు వెళ్లాల్సి వస్తుందని, తక్షణమే ప్రభుత్వం జోక్యం చేసుకొని జిల్లాకు యూనివర్సిటీని మంజూరు చేయించాలని పీడీఎస్‌యూ జిల్లా కార్యదర్శి వంగూరి వెంకటేష్ రాష్ట్ర రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డిని కోరారు. గురువారం ఖమ్మంలో మంత్రిని కలిసిన నాయకులు ఈ మేరకు వినతిపత్రం అందించారు. అధ్యక్షులు లక్ష్మణ్, నాయకులు కరుణ్, ప్రసాద్, సందీప్, శ్రీను, లాల్‌పాషా, రాకేష్, భరత్, విష్ణు పాల్గొన్నారు.

బచ్చోడును మండల కేంద్రంగా ఏర్పాటు చేయాలని మంత్రికి వినతి

తిరుమలాయపాలెం: మండలంలోని బచ్చోడు గ్రామాన్ని మండల కేంద్రంగా ఏర్పాటు చేయాలని కోరుతూ గురువారం రాష్ట్ర గృహనిర్మాణ రెవెన్యూ సమాచారశాఖమంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి కి సీపీఐఎంఎల్ మాస్ లైన్ ప్రజాపంథా ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు. వివిధ గ్రామాలను కలిపే లింకు రోడ్లకు నిధులు మంజూరు చేయాలని కోరారు. అర్హులందరికి ఇళ్ల స్థలాలు, రేషన్‌కార్డులు ఇవ్వాలని కోరా రు. ఈ కార్యక్రమంలో ఆపార్టీ రాష్ట్ర కార్యదర్శి పోటు రంగారావు, రాయల చంద్రశేఖర్, జిల్లా కార్యదర్శి గోకినపల్లి వెంకటేశ్వరరావు, ఆర్.శివలింగం, కె. నాగేశ్వరరావు, ఆవుల అశోక్, తిమ్మిడి హనుమంతరావు, కె.వెంకటరెడ్డి, పి.వెంకటస్వామి, లింగారెడ్డి పాల్గొన్నారు.


మంత్రికి వినతిపత్రం అందజేస్తున్న ప్రజాపంథా నాయకులు

మాజీ సీఎం కేసీఆర్‌ను కలిసిన ఉమ్మడి జిల్లా నాయకులు

ఖమ్మంకార్పొరేషన్/సత్తుపల్లి, ఫిబ్రవరి 1: గజ్వేల్ శాసనసభ్యుడిగా, బీఆర్ఎస్ ఎల్పీనేతగా గురువారం బాధ్యతలు స్వీకరించిన మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌ను ఉమ్మడి జిల్లా బీఆర్ఎస్ ప్రజా ప్రతినిధులు, మాజీ ప్రజా ప్రతినిధులు కలిసి శుభాకాంక్షలు తెలిపారు. కేసీఆర్‌కు పుష్పగుచ్ఛం అందచేశారు. కేసీఆర్‌ను కలిసినవారిలో ఎమ్మెల్సీ, బీఆర్ఎస్ ఖమ్మం జిల్లా అధ్యక్షుడు తాతా మధుసూదన్, రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్ర, భద్రాచలం శాసనసభ్యులు తెల్లం వెంకట్రావు, మాజీ ఎమ్మెల్యేలు సండ్ర వెంకటవీరయ్య, కందాల ఉపేందర్‌రెడ్డి, మెచ్చా నాగేశ్వరరావు తదితరులున్నారు.


కేసీఆర్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న నాయకులు

కేసీఆర్‌కు సండ్ర శుభాకాంక్షలు

సత్తుపల్లి: గజ్వేల్ ఎమ్మెల్యేగా గెలుపొంది గురువారం శాసనసభ్యుడిగా ప్రమాణ స్వీకారం చేసిన బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌కు మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య శుభాకాంక్షలు తెలిపారు. హైదరాబాద్‌లో కేసీఆర్‌ను కలిసి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

తమ్మినేనికి పరామర్శ

సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రంను సండ్ర వెంకటవీరయ్య గురువారం పరామర్శించారు. ఇటీవల తమ్మినేని ఏఐజీ ఆసుపత్రిలో చికిత్స పొంది హైదరాబాద్‌లో విశ్రాంతి తీసుకుంటున్నారు. ఆయనను అక్కడ కలిసి పరామర్శించి ఆరోగ్య వివరాలు అడిగి తెలుసుకున్నారు. తమ్మినేని త్వరగా కోలుకొని ప్రజాక్షేత్రంలోకి రావాలని సండ్ర ఆకాంక్షించారు.

సాంకేతిక పరిజ్ఞానంతోనే విద్యార్థుల భవిష్యత్

సత్తుపల్లి, ఫిబ్రవరి1: సాంకేతిక పరిజ్ఞానంతోనే విద్యార్థుల భవిష్యత్ ఆధారపడి ఉంటుందని మదర్‌థెరిస్సా ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ చలసాని హరికృష్ణ అన్నారు. గురువారం మండలంలోని కొత్తూరు మదర్‌థెరిస్సా కళాశాలలో ఈఈఈ విభాగం ఆధ్వర్యంలో 'సిమ్యూలేషన్ ఆఫ్ పవర్ కన్వర్టర్ ఫిడ్ డ్రైవ్స్‌పై 3రోజుల పాటు నిర్వహించనున్న వర్క్‌షాప్ ప్రారంభమైంది. కర్నూల్‌కు చెందిన జీ.పుల్లారెడ్డి ఇంజనీరింగ్ కళాశాల ఆచార్యులు డాక్టర్ టీ.బ్రహ్మానందరెడ్డి, డాక్టర్ ఎం.హర్షవర్ధన్‌రెడ్డి విద్యార్థులకు పలు సమస్యలను నివృత్తి చేశారు. సాంకేతిక పరిజ్ఞానంతో ఆపరేట్ అయ్యే పవర్ కన్వర్టర్స్, డ్రైవ్స్‌లను రూపొందించడం, వాటి ఆపరేషన్‌కు ఉపయోగించే వివిధ సిమ్యూలేషన్ సాఫ్ట్‌వేర్‌లపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఈఈఈ హెచ్‌వోడీ డాక్టర్ వై.రాజశేఖరరెడ్డి, ఆయా విభాగాల అధ్యాపకులతో పాటు తెలుగు రాష్ట్రాలలో వివిధ ఇంజనీరింగ్ కళాశాలలకు చెందిన విద్యార్థులు పాల్గొన్నారు.


విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ట్రైనర్

రిటైర్డ్ ఏఎస్ఐకు ఎమ్మెల్యే రాందాస్‌నాయక్ నివాళి

వైరా, ఫిబ్రవరి 1: వైరా మునిసిపాలిటీ పరిధిలోని సత్రంబజార్‌లో ఇటీవల అనారోగ్యంతో మృతిచెందిన విశ్రాంత ఏఎస్ఐ వేమిరెడ్డి రామలింగారెడ్డి చిత్రపటానికి ఎమ్మెల్యే మాలోతు రాందాస్‌నాయక్ నివాళులర్పించారు. గురువారం రామలింగారెడ్డి దశదినకర్మ కార్యక్రమం జరిగింది. ఎమ్మెల్యే కార్యక్రమంలో పాల్గొని రామలింగారెడ్డి చిత్రపటానికి నివాళులర్పించారు. అలాగే వైరా మునిసిపాలిటీ పరిధిలోని పలు ప్రైవేట్ కార్యక్రమాల్లో కూడా ఎమ్మెల్యే పాల్గొన్నారు. మునిసిపల్ చైర్మన్ సూతకాని జైపాల్, కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు ఏదునూరి సీతరాములు, నాయకులు పొదిల హరినాథ్, పణితి సైదులు, ధార్న రాజశేఖర్, కన్నెగంటి నగేష్, హుస్సేన్, పఠాన్ జాన్, వాంకుడోతు బీక్యా, సత్తెనపల్లి నర్సింహారావు పాల్గొన్నారు.


నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే రాందాస్‌నాయక్

'ఆసుపత్రి కార్మికులకు వేతనాలు ఇవ్వాలి'

సత్తుపల్లిరూరల్, ఫిబ్రవరి1: సత్తుపల్లి ప్రభుత్వ ఆసుపత్రిలో పనిచేస్తున్న కార్మికులకు పెండింగ్ వేతనాలు ఇవ్వాలని ఇఫ్టూ జిల్లా నాయకులు అమర్లపూడి శరత్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం సత్తుపల్లి ప్రభుత్వ ఆసుపత్రిలో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతూ 7నెలల నుంచి శానిటైజర్, పేషంట్ కేర్, సెక్యూరిటీ గార్డులైన కార్మికులకు జీతాలివ్వకుండా కాంట్రాక్టర్ ఇబ్బందులు పెడుతున్నారని,కార్మికులపై సవతి తల్లి ప్రేమ చూపుతుందన్నారు. ప్రభుత్వం స్పందించాలని కోరారు. కార్యక్రమంలో రవి, కమాఆరి, శ్రీను, కృష్ణవేణి, ప్రశాంత్, రాజేశ్వరి, పద్మ తదితరులు పాల్గొన్నారు.

గ్రామీణ భారత్‌బంద్‌ను జయప్రదం చేయండి

కొణిజర్ల, ఫిబ్రవరి 1: మోడీ రైతుకార్మిక వ్యతిరేక విధానాలను దిక్కురిస్తూ అఖిల భారత కార్మికసంఘాల ఆధ్వర్యంలో 16న జరిగే గ్రామీణ భారత్‌బంద్‌ను జయప్రదం చేయాలని తెలంగాణ రాష్ట్ర రైతుసంఘం నాయకులు తమ్మిశెట్టి వెంకటేశ్వర్లు, ప్రగతిశీల రైతుసంఘం జిల్లా సహాయకార్యదర్శి పాశం అప్పారావు, రైతుసంఘం జిల్లా నాయకులు షేక్ ఖాసీం, జిల్లా నాయకులు చెరుకుమల్లి కుటుంబరావు పిలుపునిచ్చారు. గురువారం కొణిజర్ల సీపీఎం కార్యాలయంలో వామపక్ష రైతుసంఘాల ఐక్య కార్యాచరణ సమావేశంలో మాట్లాడారు.బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి పది సంవత్సరాలు అవుతున్న రైతాంగ, కార్మికవర్గం ప్రజల సమస్యలను పరిష్కరించడంలో విఫలం అయిందన్నారు. నాయకులు వెంకయ్య, రాంబాబు, పాల్గొన్నారు.

అంతర్గత మార్కుల పరిశీలన

ఏన్కూరు, ఫిబ్రవరి1: పదో తరగతి విద్యార్థుల ఎఫ్‌ఏ అంతర్గత మార్కులను పరిశీలించారు. గురువారం జిల్లాపరిషత్ ఉన్నతపాఠశాల, కస్తూర్బాగాంధీ విద్యాలయం, గురుకుల పాఠశాల విద్యార్థుల ఎఫ్‌ఏ నోటుబుక్స్‌లను తనిఖీచేశారు. కార్యక్రమంలో బురదరాఘవాపురం ఉన్నత పాఠశాలకు చెందిన హెచ్‌ఎం ఎం.శ్రీనివాస ఆధ్వర్యంలో అన్ని సబ్జెక్టుల ఎఫ్‌ఏలు పరిశీలించి సంతృప్తి వ్యక్తంచేశారు. ఈ కార్యక్రమలో హెచ్‌ఎంలు కూరాకుల సైదయ్య, టి.శ్రీనివాసరెడ్డి, ఉషారాణి, బిరామదాస్ తెలుగు, జి.శ్రీనివాస్ హిందీ, చంద్రప్రకాష్ ఇంగ్లీష్, చక్రపాణి , సుభాషిణి గణితం, కైలాస్‌ప్రసాద్ భౌతికశాస్త్రం, ఉప్పలయ్య బయాలజీ, బీమ్‌సింగ్ సోషల్ పరిశీలకులుగా వ్యవహరించారు.

రాష్ట్ర స్థాయి పతకాలు సాధించిన

సాంఘిక సంక్షేమ డిగ్రీ కళాశాల విద్యార్థులు

ఖమ్మం రూరల్, ఫిబ్రవరి 1: మండల పరిధిలోని మద్దులపల్లిలోని సాంఘిక సంక్షేమ మహిళా డిగ్రీ కళాశాల విద్యార్థులు ఇటీవల ఘట్‌కేసర్‌లో నిర్వహించినరాష్ట్రస్థాయి క్రీడా పోటీల్లో కళాశాల విద్యార్థులు వివిధ విభాగాల్లో పతకాలు సాధించారని కళాశాల ప్రిన్సిపాల్ ఝాన్సీరాణి గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. కబడ్డీలో బంగారు పతకం, 400 మీటర్ల రిలేలో వెండి, డిస్కస్ త్రో, షార్ట్ పుట్ విభాగాల్లో కాంస్య పతకాలు సాదించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పీడీ చామంతి, వైస్ ప్రిన్సిపాల్ శ్రీ లక్ష్మీ, ఆధ్యాపకులు పాల్గొన్నారు.

డీ రిజర్వేషన్ రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధం

- ఏఐఎస్ఎఫ్ జాతీయ సమితి సభ్యులు రామకృష్ణ

ఖమ్మంసంక్షేమవిభాగం, ఫిబ్రవరి 1: నూతన జాతీయ విద్యావిధానంలో బాగంగా ఉన్నతస్థాయిలో విద్యలో డీ రిజర్వేషన్ విధానం అమలు చేయటంతో పేద, మధ్యతరగతి విద్యార్థులు ఉన్నత విద్యకు దూరం అవుతున్నారని ఏఐఎస్ఎఫ్ జాతీయ సమితి సభ్యుడు ఇటికాల రామకృష్ణ విమర్శించారు. గురువారం గిరిప్రసాద్ భవన్‌లో నిర్వహించిన ఏఐఎస్ఎఫ్ జిల్లా సమితి సమావేశంలో ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం వెంటనే డీ రిజర్వేషన్ విధానాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. డీ రిజర్వేషన్ విధానం రద్దు చేసే వరకు ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో ఆందోళన కార్యక్రమాలు చేపడ్తామని హెచ్చరించారు. ఈ సమావేశంలో నాయకులు చందులాల్, రోహిత్, రాకేష్, ప్రతాప్, రాజు, సునీల్, ప్రభాస్, నరేశ్, గోపీ, విజయ్ పాల్గొన్నారు.

జిల్లాస్థాయికి సత్తుపల్లి విద్యార్థుల ఎంపిక

సత్తుపల్లిరూరల్, ఫిబ్రవరి 1: చెకుముకి టాలెంట్ టెస్ట్‌లో జిల్లాస్థాయికి సత్తుపల్లి విద్యార్థులు 9మంది ఎంపికైనట్లు జనవిజ్ఞాన వేదిక బాధ్యులు సాంబశివారెడ్డి, కంబంపాటి వెంకటేష్ గురువారం తెలిపారు. ఎంపికైన వారిలో విద్యార్థులు చరణ్‌తేజ, మణికంఠ, చైతన్య, దత్తా, నాగచైతన్య, సాయినాగ ఉపేంద్ర, మౌలానా, షఫిక్, భారత్‌చంద్ర ఉన్నారు. ఈ 9మంది రేపు ఖమ్మంలోని రిక్కా బజార్ ఉన్నత పాఠశాలలో ఉదయం 10గంటలకు నిర్వహించే పోటీలలో పాల్గొనున్నారు.

4న చెమటపూల తోట పుస్తక ఆవిష్కరణ

ఖమ్మం సాంస్కృతికం ఫిబ్రవరి 1: ప్రముఖ కవి గాయకుడు రౌతు రవి రచించిన తాజా కవిత్వ సంకలనం 'చెమటపూల తోట' పుస్తక ఆవిష్కరణ సభ ఈనెల 4న ఖమ్మంలోని జడ్పీ సమావేశ మందిరంలో ఉదయం 10 గంటల నుంచి జరుగనుంది. ప్రజా గాయకుల ఆటాపాట నిర్వహిస్తామని ఉభయ రాష్ట్రాలకు చెందిన పలువురు కవులు, అభ్యుదయ వాదులు హాజరవుతారని రౌతు రవి తెలిపారు.

మాజీ సర్పంచ్ కుటుంబానికి జడ్పీ చైర్మన్ పరామర్శ

బోనకల్, ఫిబ్రవరి 1: మండలంలోని పెద్దబీరవల్లి మాజీ సర్పంచ్ తాళ్లూరి దుర్గమ్మ సంస్మరణ సభకు గురువారం జడ్పీ చైర్మన్ లింగాల కమల్‌రాజ్, బీఆర్ఎస్ నాయకులు యనమద్ది శ్రీనివాసరావు, రెడ్డిబోయిన ఉద్దండు, సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు పోతినేని సుదర్శన్‌రావు, పొన్నం వెంకటేశ్వరావు, కల్యాణం వెంకటేశ్వరావు, బొంతు రాంబాబు, చింతలచెర్వు కోటేశ్వరావు, దొండపనేని నాగేశ్వరావులు వచ్చి నివాళులర్పించారు. నిస్వార్థంగా ప్రజా సేవ చేసిన ప్రజాప్రతినిధిగా దుర్గమ్మ ప్రజల మనస్సులో చిరస్థాయిగా నిలిచి పోయారని ఆమె సేవలను కొనియాడారు.

సీఐకి కాంగ్రెస్ నాయకుల సన్మానం

రఘునాథపాలెం,ఫిబ్రవరి1: రఘునాథపాలెం సీఐగా బాధ్యతలు స్వీకరించిన శ్రీహరిని మండల కాంగ్రెస్ నాయకులు సన్మానించారు. గురువారం కాంగ్రెస్ నాయకులు తుమ్మలపల్లి నర్సింహారావు, మందా గోపి, అంగడాల నర్సింహారావు, సంగయ్య సన్మానించిన వారిలో ఉన్నారు.

ఈజీఎస్ పనులను పరిశీలించిన శిక్షణ కలెక్టర్

నేలకొండపల్లి, ఫిబ్రవరి1: శిక్షణ కలెక్టర్ మయాంక్ సింగ్ గురువారం మండలంలోని చెన్నారం, కోరట్లగూడెం, మూటాపురం, పైనంపల్లి గ్రామాల్లోని ఈజీఎస్ పనులను పరిశీలించారు. రికార్డులను తనిఖీ చేశారు. అధికారుల నుంచి పనుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఏపీడీ వెంకటరాజు, ఎంపీడీవో జమలారెడ్డి, ఏపీవో సునీత తదితరులు ట్రైనీ కలెక్టర్ వెంట ఉన్నారు.

కామేపల్లి పీఏసీఎస్ చైర్మన్‌పై అవిశ్వాస తీర్మానంపై పరిశీలన

కామేపల్లి, ఫిబ్రవరి 1: కామేపల్లి పీఏసీఎస్ చైర్మన్ తీర్థాల చిదంబరరావుపై 12మంది డైరెక్టర్లు అవిశ్వాస తీర్మాణం చేసి జిల్లా అధికారికి విజయకుమారికి వినతిపత్రం అందజేసిన విషయం విదితమే. అందులో భాగంగా వేంసూర్ అసిస్టెంట్ రిజిస్టర్ కె. కిషోర్ గురువారం కామేపల్లి పీఏసీఎస్ కార్యాలయాన్ని పరిశీలించారు. అవిశ్వాసం తీర్మాణం చేసిన 12మంది డైరెక్టర్ల వివరాలను నమోదు చేసుకొని, వారి సంతకాలను పరిశీలించారు. వినతి పత్రాన్ని పరిశీలించారు. ఈ పరిశీలనలో డైరెక్టర్లు పుచ్చకాయల వీరభద్రం, కరుణ, కాట్రాల రోషయ్య, గుజ్జర్లపుడి రాంబాబు, యాదగిరి, పెంట్యా, పద్మ, వెంకటనర్సమ్మ, సేత్రాం సీతఊట నాగయ్య తదితరులు ఉన్నారు.

వృద్ధులకు రగ్గుల పంపిణీ

సత్తుపల్లి, ఫిబ్రవరి1: సుధా హెర్బల్ ఛారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో వృద్ధులకు రగ్గులు గురువారం పంపిణీ చేసిటన్లు ఫౌండర్, కొనకళ్ల సుధారాణి తెలిపారు. చెరుకుపల్లిలోని 15కుటుంబాలకు అందజేశామని అన్నారు.